

పతాకస్థాయిలో ప్రచార హోరు



నేడు చంద్రబాబు.. రేపు అమిత్ షా రాక

- ఉండి, ఏలూరుల్లో బహిరంగ సభల్లో బాబు
- భీమవరంలో అమిత్ షా రోడ్ షో.. బహిరంగ సభ
- భారీగా తరలిరానున్న జనం.. ఏర్పాట్లు పూర్తి
- జగన్ తాడేపల్లిగూడెం పర్యటన రద్దు

సార్వత్రిక ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరుకుంది. మరో రెండు రోజులు మాత్రమే అభ్యర్థులకు ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉంది. ఒకరోజు ముందుగా ప్రచారాన్ని నిలిపివేయాలి. ఇప్పటికే సీఎం జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ తదితరులు తమ ప్రచారాలతో హోరెత్తించారు. ప్రచారానికి మిగిలి వున్న ఈ రెండు రోజులు ఉమ్మడి జిల్లాను మరింత మంది చుట్టేయనున్నారు.

(ఏలూరు/భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం అధినేత చంద్రబాబు మరోమారు శుక్రవారం ఉదయం పది గంటలకు ఉండి, మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఏలూరులో పర్యటించనున్నారు. ఉదయం భీమవరం వీపీఎస్ గార్డెన్స్‌కు సమీపంలో చంద్రబాబు హెలికాప్టర్ ల్యాండ్ అవుతుంది. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి ఉదయం పది గంటలకు ఉండి ప్రధాన సెంటర్‌కు చేరుకుని బహిరంగ సభలో మాట్లాడతారు. చంద్రబాబు వ్యూహాత్మకంగా ఈ నియోజకవర్గ పర్యటన ఖరారు చేశారు. ఇక్కడ కూటమికి వ్యతిరేకంగా వైసీపీతోపాటు, ఇండియన్ ఫ్యార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి పోటీ పడుతున్నాయి. దీంతో టీడీపీ శ్రేణులన్నీ ఏకతాటిపై ఉండేలా బాబు పర్యటన దోహదపడనుంది. ఈ సభ పూర్తయిన తర్వాత ఇక్కడ నుంచి ఉదయం 11.40 నిమిషాలకు ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ర్యాలీగా స్థానిక 12 పంపుల సెంటర్‌కు చేరుకుని అక్కడ జరిగే ప్రచార సభలో పాల్గొని ప్రసంగిస్తారు. చంద్రబాబు రాక సందర్భంగా పెద్దఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో నేరుగా చంద్రబాబు ఏలూరు రానుండడంతో కూటమి శ్రేణులన్నీ పెద్దఎత్తున ప్రచార సభకు హాజరయ్యే అవకాశం ఉంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు ప్రజలనుద్దేశించి చంద్రబాబు మాట్లాడతారు. ఆయా నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున ప్రజలు కదలి రావడానికి వీలుగా పార్టీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. చంద్రబాబు సభకు హాజరు కావాల్సిందిగా పార్టీ శ్రేణులకు ఏలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బడేటి చంటి పిలుపునిచ్చారు.

రేపు అమిత్ షా రాక

మరోవైపు కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా భీమవరం పర్యటన ఖరారైంది. శనివారం సాయంత్రం నిర్వహించే రోడ్ షో, అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతోపాటు చంద్రబాబు బహిరంగ సభలో మాట్లాడతారు. భీమవరం, ఉండి నియోజకవర్గాల నుంచి వేలాది మంది ప్రజలు, మూడు పార్టీల అభిమానులు భారీగా హాజరయ్యేలా టీడీపీ, జనసేన, బీజేపీ చర్యలు తీసుకుంది. ప్రచారానికి చివరి రోజు కావడంతో ఉండి టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణరాజు ఈ సభకు భారీ జనసమీకరణకు సిద్ధమవుతున్నారు. అమిత్ షా పర్యటనను, నరసాపురం లోక్‌సభతో పాటు, అన్ని నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అందుకే కూటమి నేతలంతా అన్ని నియోజకవర్గాల్లో పర్యటన పూర్తిచేశారు. ఇప్పుడు అమిత్ షా రాకతో కూటమిలో మరింత జోష్ నింపనుంది. కొద్ది రోజుల క్రితం రాష్ట్రంలో పర్యటించిన అమిత్ షా




సీఎం జగన్‌పై నిప్పులు చెరిగారు. 'రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం. అవినీతి అమోఘం' అంటూ దుయ్యబట్టారు. పోలవరాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తామంటూ భరోసా ఇచ్చారు. ఈ ప్రకటన ప్రజల్లో తీవ్ర ప్రభావం చూపింది. భీమవరం పర్యటనతో జనంలో మరింత ప్రభావం చూపే అవకాశం ఉందని కూటమి విశ్వసిస్తోంది. ఈ రోడ్ షోకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే జిల్లాలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ విడతల వారీగా పర్యటించారు. తణుకులో ఉమ్మడిసభ నిర్వహించారు. నర్సాపురం, పాలకొల్లులో నిర్వహించిన సభల్లో చంద్రబాబు పాల్గొన్నారు. కూటమి అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లారు. జనసేనాని పవన్ కల్యాణ్ తాడేపల్లిగూడెం, నర్సాపురం, భీమవరంలో సభల్లో పర్యటించి స్థానిక వైసీపీ నాయకత్వం అవినీతిపై విరుచుకుపడింది. రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమిని గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు అమిత్ షాతో కూటమి ఫినిషింగ్ టచ్ ఇవ్వనుంది. ఇది కూటమి విజయానికి మరింత దోహద పడనుంది.

జగన్ పర్యటన వాయిదా

సీఎం జగన్ తాడేపల్లిగూడెం పర్యటన వాయిదా పడింది. శుక్రవారమే పర్యటన ఖరారైనప్పటికి చివరి నిమిషంలో రద్దు అయ్యింది. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత ఇప్పటికే జగన్ పలుమార్లు పర్యటించారు.



భీమడోలులో ధర్మరాజుకు హారతి ఇస్తున్న మహిళలు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు

భీమడోలు/ఉంగుటూరు, మే 9 : తనకు ఓటేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. నియోజకవర్గంలో ఆయన గురువారం మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఉంగుటూరు మండలం గొల్లగూడెం నుంచి రెండు వందల మోటారు సైకిళ్లతో వేములపల్లి సుధీర్ నాయకత్వంలో ర్యాలీలో పాల్గొన్నారు. సీతారాంపురం, రాచూరు గ్రామాల మీదుగా ర్యాలీని కొనసాగించారు. భీమడోలు మండలంలోనూ భారీ ర్యాలీ చేశారు. భీమడోలు, అర్జావారిగూడెం, వడ్లపట్ల, కురెళ్ళగూడెం, లింగంపాడు, కోడూరుపాడు, దుద్దేపూడి గ్రామాల మీదుగా ఈ ర్యాలీ కొనసాగింది. ప్రచారంలో భాగంగా గ్రామాల్లోని పురవీధుల్లో తిరిగిన ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు గాజు గ్లాసు గుర్తుపై, ఏలూరు ఎంపీ అభ్యర్థిగా పుట్టా మహేష్‌యాదవ్‌కు సైకిలు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. భీమడోలు మాజీ సొసైటీ అధ్యక్షులు గన్ని నాగగోపాలరావు, జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు కార్యకర్తలు, తెలుగు మహిళలు, వీర మహిళలు పాల్గొన్నారు.



చింతమనేనితో కలిసి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మాజీమంత్రి దేవినేని ఉమ

జగన్‌రెడ్డి పాలనంతా నరకమే..

- మాజీ మంత్రి దేవినేని

బుట్టాయగూడెం/పెదవేగి, మే 9 : గడిచిన ఐదేళ్లుగా జగన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలు ప్రత్యక్ష నరకాన్ని చూశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు అన్నారు. బుట్టాయగూడెంలోని బొరగం శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. 'పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చంద్రబాబు హయాంలో 72 శాతం పూర్తిచేస్తే జగన్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని గాలికి వదిలేసి రైతుల నోట్లో మట్టి కొట్టారు. జగన్‌రెడ్డి పాలనకు చమరగీతం పాడడానికి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌ను, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి' అంటూ పిలుపునిచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, చిర్రి బాలరాజు, బొరగం శ్రీనివాస్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు అనపర్తి వెంకట నారాయణ, జనసేన పరిశీలకురాలు సౌజన్య తదితరులు పాల్గొన్నారు. పెదవేగి మండలం వంగూరులో చింతమనేని ప్రభాకర్‌తో కలిసి దేవినేని ఉమా మహేశ్వ రరావు ఎన్నికల ప్రచారం చేశారు. దెందులూరులోని దుష్టశక్తులు, అవినీతిపరుల ఆటలు ఇక సాగవన్నారు. ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు చింతమనేని ప్రభాకర్, పుట్టా మహేష్ యాదవ్‌లకు ఓట్లేసి గెలిపించాలన్నారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పనిలో ఉన్నాం... తర్వాత రండి..!



- ఎన్నికల వేళ పనులన్నీ వాయిదాలే
- తాగు నీరైనా, కరెంటు కోతలైనా..
- అప్పులు దగ్గర నుంచి.. కొనుగోళ్ల వరకు ఇదే సీను
- ఎన్నికల వేళ వాయిదాలు
- రిజిస్ట్రేషన్లు కూడా తగ్గుముఖమే
- పోలింగ్ తర్వాతే మళ్ళీ యథాతథ స్థితి

ఏలూరు, మే 9(ఆంధ్రజ్యోతి):ఒకరోజు కాదు రెండు రోజులు కాదు, గడిచిన నాలుగు మాసాలుగా అంతా ఎన్నికల సీన్‌లోనే ఉన్నారు. ప్రతి పనికి ఎన్నికలైన తర్వాత చూద్దామనేదే అందరినోట సమాధానం. తాగునీటి సమస్య అయినా, కరెంటు కోతలు అయినా, పూడిక పోయిన డ్రెయినేజీ సమస్య ఉన్నా, పరిష్కారం కాని అనేక సమస్యలు వెంటాడుతున్నా... ఏదైనా అన్ని పోలింగ్ తర్వాతే. యంత్రాంగం యావత్తు ఇప్పటికే ఎన్నికల పనుల్లో తలమునకలై ఉంది. సమస్య ఏదైనా ఉంటే తమ దృష్టికి తేవాలని కోరుతున్నారే తప్ప ఒకవేళ ఎవరైనా సమస్య తీసుకువెళితే వాటి పరిష్కా రానికి సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తిరిగి యథా తథ స్థితే జిల్లా అంతటా ఇలాంటి పరిస్థితే అన్నిచోట్ల కనిపిస్తోంది. ఆఖరికి ఆసుపత్రిలోనూ, ఆపరేషన్‌లోనూ ఇదే వాయిదా పద్ధతి. ప్రత్యేకించి శని, ఆది, సోమ మూడురోజులు సెలవులు వస్తుండటంతో ఈ మూడురోజులు కొంతమందికి బంఫర్ ఆఫరే.

ఎక్కడిది అక్కడే..

కరెంటు పోయిందంటే.. వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడం, కొద్దిగంటల వ్యవధిలోనే సమస్య పరిష్కారమయ్యేది. తాగునీరు రావడం లేదంటే అధికారులు అప్రమత్తం. చిన్నాచితక సమస్యలు వెన్నాడుతుంటే వీటి పరిష్కారం అప్పట్లో కొంత ఆలస్యమైనా పరిష్కారమయ్యేవి. కాని ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా ఎన్నికల సీజన్‌తో ముడిపెట్టి పక్కన పడేస్తున్నారు. వాస్తవానికి తాగునీటి సమస్య జిల్లా అంతటా లేకపోయినా ఎదురైన చోట్ల పరిష్కరించలేకపోతున్నారు. ఎక్కడికక్కడ అధికారులను బదిలీలు చేసి కొత్తవారిని ఆయా స్థానాల్లో నియమించడం, వారికి స్థానిక సమస్యల మీద అవగాహన లేకపోవడానికి తోడు ఎన్నికల శిక్షణా కార్యక్రమాలు, ఏర్పాట్లలో తలమునకలై ఉండడం, ఈలోపు జిల్లాస్థాయి అధికారులు జూమ్ కాన్ఫరెన్స్‌లు, ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తుండటంతో ఇప్పుడు అందరి దృష్టి ఎన్నికల మీదే కాని పరిష్కారం మీద పక్కకు జరిగింది. మునిసిపాలిటీల్లో అనేకచోట్ల పారిశుధ్యం అంతంతగా మారింది. మురుగు కాల్వల శుభ్రత వెనుక బడింది. ఇలాంటి సమస్యలకు కూడా కొందరు కావాలని ఎన్నికలతోనే ముడిపెట్టి తప్పించుకోవడం విశేషం. సిఫార్సులు లేవు, అంతకంటే బెదిరింపులు రావు, దీన్ని ఆసరాగా తీసుకుని ఇంకొందరు మొఖం చాటేసే పనిలో పడుతున్నారు. మండుటెండలు మరో ప్రధాన సమస్య. పింఛన్లు పంపిణీ, ఓటర్లకు స్లిప్పులు పంపిణీ, ఈ వ్యవహా రాలతో గ్రామసచివాలయాల రోజువారీ పని ఎప్పుడో మూలనపడింది. ఎన్నికలు పూర్తి అయ్యేంతవరకు ఇంకో పని చేసేది లేదు... ఇప్పుడు ఆసాంతం ఎన్నికలకు సంబంధించి అధికారులు చెప్పిందే చేస్తాం. దీనికి తోడు రిపోర్టులు ఇవ్వడం, మరికొన్ని నివేదికలను రప్పించడంతోనే సరిపోతోంది. 13వ తేదీ తరువాతే ఎవరైనా వస్తే చేసి పెడతాం అంటూ సిబ్బంది నుంచి సమాధానం వినిపిస్తోంది. బ్యాంకులకు వచ్చే పోయే వారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. లావాదేవీలు గతనెలలో కంటే ఈనెలలో భారీగా తగ్గాయి. రిజిస్ట్రేషన్ తేదీలను ఎన్నికలతో ముడిపెట్టి వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఎలాగో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రకరకాల పాఠాలు... గుణపాఠాలు పరిస్థితిలో ఏదైనా మార్పువస్తే తప్ప భూముల ధరలు పెరిగే అవకాశం లేకపోవడంతో ఇప్పటికి ఇప్పుడు అమ్మకాలు, కొనుగోలు చేయకుండా వీటన్నింటిని జూన్ 10వ తేదీ తరువాతే ఎక్కువమంది ముహూర్తం ఖరారు చేసుకున్నారు.

రుణాలు బంద్

బ్యాంకుల్లో రుణాలు ఇచ్చే కార్యక్రమంతో పాటు రోజువారీ చేబదుళ్ల కూడా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇప్పటికే ఎన్నికలు వేడెక్కిన తరుణంలో రాజకీయ విద్వేషాలు పెరగటం, పెరిగిన దరిమిలా ఏదైనా వ్యక్తిగత అంశా పై విచారణ చేయాల్సి వస్తే ఇవి పక్కాగా ఉండవని భావించి రుణాలు ఇచ్చే ప్రక్రియలో కొంతవాయిదా పద్ధతి కనిపిస్తోంది. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులైతే ఈనెల రోజులు పెద్ద మొత్తంలో సొమ్ము ఎవరికి ఇచ్చేది లేదని, తనఖాలకు కూడా తాము సిద్ధంగా లేమని మొఖం చాటేయడం ఆరంభించారు. వీరితో సమానంగా కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు వీరి బాటలోనే పయనిస్తున్నాయి. వాహనాలు అమ్మకాలు, కొనుగోళ్ళు ఇప్పటికే మందగించాయి.

ఫ్యాన్ కింద.. ముచ్చెమటలు!



- ప్రచారంలో పుట్టా మహేశ్ వినూత్నశైలి
- ఏలూరు లోక్‌సభలో దూసుకుపోతున్న కూటమి
- అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులదే దూకుడు
- జనం మెచ్చేలా ప్రచార సరళి..వాగ్దానాలు
- వైసీపీకి దడ పుట్టించేలా ప్రచారాస్త్రాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

అధికార వైసీపీకి ముచ్చెమటలు పట్టించేలా కూటమి అభ్యర్థులు నువ్వా.. నేనా అనే రీతిలో ప్రచారం హోరెత్తిస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో అధికార వైసీపీ మన ఊరుకు ఏం చేశారు.. నియోజకవర్గానికి చేసిన కొత్త ఏమిటి అంటూనే మమ్మల్ని గెలిపిస్తే మీలో ఒకడిగా ఉంటాం.. నియోజకవర్గాన్ని దాంతోపాటు గ్రామాన్ని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారం సంపూర్ణంగా అమలు చేస్తామంటూనే ఊరు, వాడా హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్ని నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం చేశారు. బీజేపీ ప్రచారంలో ప్రముఖ పాత్ర వహించింది. పోలింగ్‌కు ఇంకా మూడు రోజులే గడువు ఉండగా ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ తనదైన శైలిలో మారుమూల గ్రామాల్లోను రాత్రి పొద్దు పోయేంత వరకు తిరుగుతున్నారు. సాధారణ ఎన్నికల ప్రచారం చివర దశకు వచ్చేసింది. కూటమి అభ్యర్థులు అధికార వైసీపీతో ఢీకొంటున్నారు. ఇండిపెండెంట్‌లు ఎవరి ఎంతటి వారుగా తమకు తోచిన విధంగా ప్రచారం సాగిస్తున్నారు. పార్టీ అధినేతలు ఆయా నియోజక వర్గాల్లో మీటింగ్‌లకు హాజరు కావడం, స్థానిక ఎమ్మెల్యే తీరుపైన, ఈ ఐదేళ్లలో రాష్ట్రానికి, నియోజక వర్గాలకు జరిగిన నష్టాల పైన గొంతెత్తడం దానికి ప్రజల నుంచి స్పందన లభించడం దాంతోపాటే చిన్నపాటి మీటింగ్‌లకు కూడా పెద్ద ఎత్తున స్థానికులు హాజరు కావడంతో అధికార వైసీపీ అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. కూటమి పక్షాన అభ్యర్థులు ఎన్నికల సంఘం సూచనలు పాటిస్తూనే ప్రచార సభల్లో బుల్లెట్‌లా దూసుకుపోయారు.

- ఏలూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బడేటి చంటి గడిచిన 90 రోజులుగా కంటిమీద కునుకులేకుండా విస్తృత ప్రచారం చేస్తూనే ఉన్నారు. పూర్వపు పరిచయాలు, వైసీపీ నుంచి కొత్తగా టీడీపీలోకి మారిన నేతల సహకారంతో స్థానికుల మద్దతుతో ప్రచారం ఆకాశాన్నంటేలా చేశారు. కార్పొరేషన్‌తోపాటు రూరల్ మండలంలోనూ దూసుకెళ్ళారు. ఏలూరు నగరంలో సీఎం జగన్ వైసీపీ పక్షాన ప్రచారం చేసిన ప్రజల నుంచి పెద్దగా స్పందన లేకపోవడం ఆ పార్టీకి పెద్ద షాక్‌గానే మారింది. ఇండిపెండెంట్‌లు ఎవరి ఎంతటి వారు ప్రచారం చేస్తున్నారు.
- దెందులూరులో చింతమనేని ప్రభాకర్ ప్రచార హోరును పెంచారు. ఆయన ఎక్కడికి వెళ్ళినా ప్రజల నుంచి భారీ స్పందన కనిపిస్తోంది. ఈ నియోజకవర్గంలో పందేల జోరు తారస్థాయికి చేరింది. ఇరుపక్షాలు తమ పార్టీయే గెలుస్తుందంటూ లక్షల్లో పందేలకు దిగుతున్నారు. ఇప్పుడు ఈ నియోజకవర్గం జిల్లాలోని మిగతా నియోజకవర్గాలు కంటే అందరి దృష్టిలో పడింది.
- చింతలపూడిలో సొంగా రోషన్‌కుమార్ ప్రచారంలో రాటుదేలారు. ఓటర్ల సంఖ్యలో జిల్లాలోనే రెండవ స్థానంలో ఉన్న చింతలపూడిలో విజయకేతనం ఎగురవేయాలనే పట్టుదలతో సీనియర్ నేతలు ముత్తారెడ్డి, ఘంటా మురళి, చినబాబు, చలపతి, శ్యామ్ చంద్రశేషు, ఆకుమర్తి రామారావు, బీజేపీ అధ్య క్షుడు విక్రమ్ కిషోర్ నియోజకవర్గంలో రోషన్‌కుమార్ వెంటే ఉంటూ ప్రచారాన్ని కీలక దశకు చేర్చారు. ప్రత్యర్థి పార్టీకి సవాల్ విసిరేలా పార్టీ పూర్తి స్థాయిలో చింతలపూడి, జంగారెడ్డిగూడెంలో పుంజుకునేలా చేయగలిగారు.
- పోలవరం నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు అటు టీడీపీ ఇటు జనసేన పెద్దల నేతృత్వంలోనే ప్రచారం చేస్తున్నారు. సీనియర్ నేతలు కరాటం రాంబాబు, టీడీపీ సీనియర్ నేత బొరగం శ్రీనివాస్, బీజేపీ నేతలు నాగరాజుతో సహా మరికొందరి నేతల మార్గదర్శకంలో ముందుకు సాగుతున్నారు. గెలుపు కోసం జనసేన ఇప్పటికే అన్ని సవాళ్లను అధిగమించి భారీగా పుంజుకోగలిగింది. గిరిజనులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో గిరిజనేతరుల మద్దతు కూటగట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.
- ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఇప్పటికే తనదైన శైలిలో ప్రచారంలో వైసీపీకి కొత్త సవాళ్ల విసురుతున్నారు. అటు బీసీ వర్గాలు, కాపు సామాజిక వర్గంతో పాటు మిగతా వర్గాలన్నింటిని కూడగట్టుకోవడంతో పాటు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఆయన సోదరుడు గోపాలరావు సహకారంతో ఈ నియోజకవర్గంలో పాగా వేసే దిశగా ప్రచారాన్ని ఇప్పటికే ముమ్మరం చేసి ప్రజలకు చేరవయ్యారు.
- నూజివీడు నియోజకవర్గంలో మాజీ మంత్రి టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి ఇదే తరహాలో దూసుకెళుతున్నారు. ఇక్కడున్న అనేక ఆటంకాలు కొంతలో కొంత అధిగమించి నూజివీడులో పూర్తిగా నిలదొక్కుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. కైకలూరులో బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ సైతం ప్రచారంలో వైసీపీకంటే ఇప్పటికే ముందు వరుసలో నిలిచారు. ఇక తన గెలుపు నల్లేరు మీద నడకే అని భావిస్తున్నారు. వైసీపీకి ధీటుగా నిలదొక్కుకోవడం, మిగతా వారికి మద్దతు కూడగొట్టుకోవడంలో ఆయన సక్సెస్ అయ్యారు.



ముదినేపల్లిలో ఎన్నికల ప్రచారంలో కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్

పుట్టానే పెద్దదిక్కు..

ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ప్రచార శైలి, ప్రచారంలో దూకుడు, వాగ్దానాల ఒరవడి అసెంబ్లీ అభ్యర్థులకు కలిసొచ్చింది. 45 రోజుల్లోనే ప్రత్యర్థుల ఆరోపణలు తక్షణం తిప్పికొట్టడం, వారిపై కౌంటర్ ఎక్కుపెట్టడంతో సక్సెస్ అయ్యారు. ఇటీవల వైసీపీ ఎంపీ అభ్యర్థి దూకుడుగా మహేష్‌పై విమర్శలకు దిగినప్పుడు అంతకంటే రెట్టించిన వేగంతో మహేష్ తిప్పికొట్టి వైసీపీకి రెండవ చాన్స్ లేకుండా చేశారు. పోలవరం నియోజకవర్గంలో కుక్కునూరు, వేలేరుపాడు, టీనరసాపురం, జీలుగుమిల్లి వంటి మండలాలు అన్నింటిలోనూ చుట్టుముట్టివచ్చారు. దెందులూరు, ఉంగుటూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో ఆయన తిరగని ప్రాంతం లేదు. మహేష్ తన శైలితో పాత విధానానికి స్వస్తి పలికేలా ప్రచారంలో కొత్తదనం ఉట్టిపడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. పరిష్కరించే సమస్యలను ప్రస్తావించడం, తాను ఢిల్లీకి వెళితే మీ వాయిస్‌తో పార్లమెంట్‌లో వినిపిస్తానని పదే పదే చెబుతూనే వస్తున్నారు. ఆయన నేతృత్వంలో ఏడు నియోజకవర్గాల ఎమ్మె ల్యే అభ్యర్థులు పరస్పర సహకారంతో అటు ప్రచారంలోనూ, ఇటు ఎత్తుగడలలోనూ ఒకే మాట, ఒకే బాటగా ముందుకు సాగడం సహజంగానే టీడీపీ, జనసేన, బీజేపీ పక్షాల్లో జోష్ పెంచి, వైసీపీలో గుబులు రేపింది. కొన్ని నియోజకవర్గాల్లో మహేష్ పేరు మారుమూల గ్రామాల పరిధిలోకి వెళ్ళింది. పుట్టా గెలుపు దాదాపు ఖాయమైందని అసెంబ్లీ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలవరం నిర్వాసితులను ఆదుకోవడానికి ఆర్‌అండ్‌ఆర్ పథకానికి రక్షణ నిధి కోసం జనసేనాధిపతి పవన్ కల్యాణ్ కోటి రూపాయలు ప్రకటించడం, సమాంతరంగా తాను మరో కోటి ప్రకటించి ఎన్నికల ప్రచారంలో అందరి దృష్టిని ఆకర్షించారు. ఇప్పుడు ఇదే ఆయనను హైలెట్ చేసింది. టీడీపీ అధినేత చంద్రబాబు సైతం ఎప్పటికప్పుడు మార్గనిర్దేశకత్వం చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం : కలెక్టర్

ఏలూరుసిటీ, మే 9: జిల్లా వ్యాప్తంగా ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు 72 గంటల ముందు చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు విస్తరణ, ప్రణాళిక అమలు, అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా ఎస్పీలతో గురువారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీప్రశాంతి, డీఆర్వో పుష్పమణి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు సంబంధించిన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లు లీనియర్ షామియానాలతో కవర్ అయ్యేలా చూడడంతో పాటు ప్రత్యేకించి తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్సా సేవలను అందుబాటులో ఉంచుతామన్నారు. వెయ్యికి మించి ఓట్లున్న పోలింగ్ కేంద్రాల వద్ద ఫ్లడ్‌లైట్లు, జనరేటర్లు అందుబాటులో ఉంచుతామన్నారు. 100 మీటర్ల పరిధిలో బారికేడింగ్‌లు ఏర్పాటుతో పాటు ఓటర్ల జాబితా మార్కిడి కాపీలను పూర్తి చేస్తున్నామన్నారు. ఓటరు స్లిప్‌ల పంపిణీ దాదాపు 99 శాతం పూర్తయిందన్నారు. 1083 పోలింగ్ ప్రాంతాల్లో దివ్యాంగులు ఓటు వేసేందుకు సౌకర్యంగా 1100 వీల్ చైర్‌లను, రెడ్ క్రాస్ కార్యకర్తలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈవీఎంల భద్రతకు మూడంచెల భద్రతను కల్పిస్తున్నామన్నారు. పోలింగ్ పూర్తయి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకున్న ముఖ్యంగా మహిళా సిబ్బందిని ఆయా హెడ్ క్వార్టర్లకు చేర్చేందుకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకున్నట్టు వివరించారు.

జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్

ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11వ తేదీ శనివారం సాయంత్రం 6గంటల నుంచి 14వ తేదీ మంగళవారం సాయంత్రం 6గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. చట్టవిరుద్ధమైన సమావేశాలు, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించడం నిషేధమన్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఐదుగురు కంటే ఎక్కువగా ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ భాగాలలో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించినదని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీత/హామీదార్లను కోరుతూ రుణగ్రహీత/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీత/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు షెడ్యూల్‌లో ఇక్కడ మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు ఎటువంటి అవలంబన లేని ప్రాతిపదికన" తేది: **20 మే, 2024న మ.12.30గం. నుండి మ.3.30 గం.వరకు** (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.

రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ ఖాతా నం	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీసు తేది	స్థూల బరువు	నికర బరువు
1	తాడేపల్లిగూడెం (AP)	xxxxxxxxxxx9383	మహేష్ చీకటిమిల్లి	49889	28-ఫిబ్రవరి -24	12.1	11.5
2	జంగారెడ్డిగూడెం (AP)	xxxxxxxxxxx3079	పసుమర్తి శ్రావణి	179242	09-సెప్టెంబర్ -23	61.7	57
3	జంగారెడ్డిగూడెం (AP)	xxxxxxxxxxx3780	గాజుల సత్యనారాయణ	91133	01-ఫిబ్రవరి -24	22.1	21.2

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్పు చేయు/ఖాతాను తొలగించు హక్కు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ కలిగియున్నది. వేలం ఆన్‌లైన్‌లో https://gold.samil.in (ఆన్‌లైన్ విక్రయదారు వెబ్‌సైట్) మ.12.30 గం. నుండి మ.3.30 గం. (సమయం) వరకు నిర్వహించబడుతుంది. సవివరమైన నియమనిబంధనల కొరకు ఇవి ఇవ్వబడిన వెబ్‌సైట్ https://gold.samil.in (ఆన్‌లైన్ విక్రయదారు వెబ్‌సైట్)కు లాగిన్ చేయగలరు.

ప్రదేశం : ఏలూరు జిల్లా
అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

నరసాపురం గ్లాస్ జోరు



నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో రసవత్తర పోరు సాగుతోంది. వైసీపీ, జనసేన మధ్య ప్రధాన పోటీ నెలకొంది. పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ ఫ్యాన్ స్పీడ్ తగ్గితే గ్లాస్ జోరందుకుంది. ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు కలిసొస్తాయన్న ధీమాతో అధికార పార్టీ ఉంటే, ప్రభుత్వ వ్యతిరేకత, జిల్లా కేంద్రం, మెడికల్ కాలేజీ తరలిపోవడం, శిలాఫలకాలకే పరిమితమైన అభివృద్ధి, స్థానిక ఎమ్మెల్యేపై వ్యతిరేకత తమ విజయానికి దోహదం చేస్తుందని కూటమి ధీమాతో ఉంది. ఎలాగైనా ఈసారి అధికార పార్టీకి చెక్ పెట్టాలని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కలసికట్టుగా కూటమి గెలుపు కోసం విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీంతో జనసేన గెలుపు నల్లేరుపైనడకేనన్న ధీమాతో ఉన్నారు. - నరసాపురం

• దూసుకుపోతున్న జనసేన • కూటమి విస్తృత ప్రచారం • ఫ్యాన్‌కు ఎదురుగాలి

ఎన్నికల బరిలో అభ్యర్థులు

1. కానూరి యుబికె ప్రసాద్	కాంగ్రెస్
2. బందెల రాజేంద్ర ప్రసాద్	బీఎస్పీ
3. ముదునూరి ప్రసాదరాజు	వైసీపీ
4. ఆకుల వెంకటస్వామి	బీసీవైపీ
5. కొల్లి నాయకర్	నవరంగ్ కాంగ్రెస్
6. పాలెపు నాయకర్	జాతీయ జనసేన
7. పోతురాజు యాకోబు	జైభీమ్‌రావు
8. బుర్రా రామకృష్ణ	పిరమిడ్ పార్టీ
9. బొమ్మిడి నాయకర్	జనసేన
10. కంచర్ల వెంకట రమేష్	స్వతంత్ర
11. గాది రవి	స్వతంత్ర

ఓటర్లు : 1,68,187
పురుషులు : 83,745
మహిళలు : 84,422
సామాజిక వర్గాల వారీగా
కాపులు : 52వేలు
అగ్నికుల క్షత్రియ: 32వేలు
గౌడ, శెట్టిబలిజ : 25వేలు
ఎస్సీ, ఎస్టీ : 20వేలు
మైనార్టీలు : 3500
దేవాంగ : 4వేలు
తూర్పుకాపు : 8వేలు
స్వర్ణకార : 3వేలు
ఇతరులు : 4వేలు

ఐదేళ్లుగా ప్రజల మధ్యనే..

గత ఎన్నికల్లో ఓటమి చెందిన నాయకర్ ఐదేళ్ల ప్రజల మధ్యే ఉన్నారు. గతంలో కాపు సామాజిక వర్గానికి చెందిన కేడర్ ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం అన్ని సామాజికవర్గాలు జనసేనలో పని చేస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పార్టీ నాయకులు పార్టీని ముందుకు తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన బలాన్ని నిరూపించారు. మునిసిపాలిటీలో నలుగురు కౌన్సిలర్లు గెలుపొందారు. 11 మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గెలిచారు. పార్టీకి అండగా ఉంటున్న యువత ప్రాధాన్యం పెంచారు. నాయకర్ అభ్యర్థిత్వం ప్రకటించగానే కొత్తపల్లి, జానకిరామ్, బండారు మాధవనాయుడు, పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, పీవీఆర్, మేకల సతీష్ వంటి ముఖ్య నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. జనసేన, టీడీపీ అధినేతలు పవన్, చంద్రబాబు కూడా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకర్ కుటుంబ సభ్యులు, కూటమి పార్టీలు వేర్వేరుగా నిర్వహిస్తున్న ప్రచారాలు బాగా కలిసొచ్చాయి. గత నెల రోజుల నుంచి పార్టీలో చేరికలు పెరగడం, కూటమి ఐక్యంగా కృషి చేయడం నాయకర్ విజయంపై అంచనాలు పెరిగాయి.

అభివృద్ధి ఆనవాళ్లే లేవు..!

ముదునూరి ప్రసాదరాజు నరసాపురంలో రెండు సార్లు ఓటమి, రెండు సార్లు విజయం సాధించారు. గత ఎన్నికల్లో ప్రస్తుత ప్రత్యర్థి నాయకర్‌పై స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. ఐదేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి ఆనవాళ్లు కూడా కనబడకపోవడంతో ఫ్యాన్ తిరగడం లేదు. జిల్లా కేంద్రం, మెడికల్ కాలేజీలు తరలిపోవడం ప్రధానంగా మైనస్. రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రిని తీసుకొచ్చి నియోజకవర్గంలో రూ.3200 కోట్ల పనులకు శంకుస్థాపన చేయించారు. ఒకటి రెండు మినహా మిగిలినవన్నీ పునాదుల్లోనే ఉన్నాయి. ఇటు పార్టీ కేడర్‌లో నెలకొన్న అసంతృప్తి కూడా ముదునూరి ప్రతికూలంగా మారింది. వైసీపీ క్యాడర్ కూడా కొందరు కూటమికి జై కొడుతున్నారు. ముదునూరి మాత్రం ప్రభుత్వ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ఆశతో ఉన్నారు.



బొమ్మిడి నాయకర్, జనసేన కూటమి

బలం
- టీడీపీ, బీజేపీ, జనసేన సీనియర్ నేతల విస్తృత ప్రచారం.
- గత ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి,
- కాపు, అగ్నికుల క్షత్రియ ఓటు బ్యాంకు

బలహీనత
- ఆర్థిక ఇబ్బందులతో కొంత వెనకబాటు
- అందరితో పూర్తి కలుపుగోలుతనం లేకపోవడం
- గెలుపుపై మితిమీరిన ధీమాతో ఉండడం



ముదునూరి ప్రసాదరాజు, వైసీపీ

బలం
- ఆర్థిక బలం
- ఎన్నికల్లో పనిచేసే బలమైన కోటరీ
- ప్రచారంలో అన్ని కులాల సీనియర్ నాయకులు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు

బలహీనత
- జిల్లా కేంద్రం, మెడికల్ కాలేజీ తరలిపోవడం
- గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం
- కాపు ఓటు బ్యాంకు తక్కువ
- ప్రజల్లో వ్యతిరేకత

ఓట్లు అమ్మబడవు..



పాలకొల్లు, నరసాపురంలో ఇళ్ల వద్ద ఓట్లు అమ్మబడవు అంటూ బోర్డులు

ఎన్నికల్లో చాలా మంది డబ్బు తీసుకుని ఓటు వేయడం పరిపాటి. కొందరు ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకుంటారు. ఆ కోవలోనే ఇంటి ముందు 'మా ఇంట్లో ఓట్లు అమ్మబడవు' అంటూ బోర్డు పెడుతున్నారు. నరసాపురం మండలం రుస్తుంబాదా గ్రామానికి చెందిన బాలరాజు తన ఇంటి గేటుకు ఓట్లు అమ్మబడవంటూ బోర్డు ఏర్పాటు చేశారు. కొప్పర్రు, చిట్టవరం, సీతారాంపురం, చినమామిడిపల్లి గ్రామాల్లో కొంత మంది బోర్డులు, గోడలపై రాతలు రాసి మా ఓట్లు అమ్ముకోమంటూ చెప్పడం గమనార్హం.

పాలకొల్లు పట్టణం కోడిగట్టు వీధిలో రాణి గణపతి శర్మ, రాణి విశ్వనాథం ఓట్లు అమ్మబడవని బోర్డులు పెట్టారు. విశ్వనాథం ప్రవేటు ఉద్యోగం చేసేవారు. గణపతి తెలుగు పండిట్‌గా రిటైర్ అయ్యారు. తమ ఇంటికి వచ్చి ఓట్లు అడగవచ్చు కానీ, ఏవిధమైన కానుకలు ఇవ్వరాదని, ఈవిధంగా ఎన్నికల్లో పారదర్శకత ఉండే విధంగా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.

- నరసాపురం రూరల్, పాలకొల్లు అర్బన్

అప్పుడు ఓటు కార్డులు లేవు



1995 ముందు ఓటరు గుర్తింపు కార్డులు లేవు. గ్రామ, మండల అధికారుల సహకారంతో అభ్యర్థులను గుర్తించి స్లిప్‌లు మంజూరు చేసే వారు. వాటి ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే వారు. నకిలీ ఓట్లను గుర్తిచేందుకు 1995లో ఓటరు గుర్తింపు కార్డును ఎన్నికల కమిషన్ ప్రవేశ పెట్టింది. 2004లో ఈవీఎం యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం ఓటు ఎవరికి వేశామో చూసుకునేందుకు వీలుగా వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఓటు వేస్తూ బటన్ నొక్కి బీప్ శబ్ధం గమనించాలి. **- ఆకివీడు**

నో టిక్కెట్.. ఓటేసేదెలా?



దూర ప్రాంతాల్లో ఉన్న వారు స్వగ్రామాల్లో ఓటు వేసేందుకు వస్తున్నారు. వివిధ పార్టీలు రవాణా సౌకర్యం కల్పిస్తున్నా ఎవరికి వారు రావడానికి రిజర్వేషన్ సమస్య అయింది. పోలింగ్ దగ్గర పడే కొద్ది ప్రయాణం తిరుగు ప్రయాణం టికెట్‌లకు యమ గిరాకి ఉంది. ముఖ్యంగా తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఇక్కడికి వచ్చే ప్రయాణికులకు నో టికెట్ బోర్డులు నిరాశ కలిగిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి ఆంధ్రాకు వచ్చే ప్రయాణికులు పదో తేదీ నుంచి 13వ తేదీ వరకూ వచ్చే వారు భారీగా ఖర్చుచేసి బస్సులు బుక్ చేసుకుంటున్నారు. రైలు టికెట్ అయితే ఖాళీ లేవు. తిరుగు ప్రయాణానికి మే 25 వరకూ వెయిటింగ్ లిస్ట్ నడుస్తోంది. దీంతో హైదరాబాద్‌లోని ఆంధ్రా ఓటర్లకు టికెట్ టెన్షన్ పట్టుకుంది.

- తాడేపల్లిగూడెం రూరల్

ఆయన అరెస్ట్‌నే తట్టుకున్నా..

ఎంపీ రఘురామకృష్ణరాజు సతీమణి రమాదేవి



ముస్లిం మహిళలతో మాట్లాడుతున్న కనుమూరి రమాదేవి

ఉండి నియోజకవర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కనుమూరి రఘురామకృష్ణరాజు సతీమణి రమాదేవి భర్త విజయం కోసం విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఎన్ని వేధింపులు, ఇబ్బందులు కలిగించినా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తన భర్త ప్రజల ముందుకు వచ్చారన్నారు. తనకు ఎన్నికల ప్రచారం ఏమాత్రం ఇబ్బంది కాదని, తన భర్తను అక్రమ అరెస్ట్‌నే తట్టుకుని ప్రజల ముందుకు వెళుతున్నానన్నారు.

? మీ భర్త విజయానికి ఏవిధంగా సహకరిస్తున్నారు..

భర్త విజయం కోసం పూర్తిగా సహకరిస్తున్నాను. ఆయన విజయమంటే ప్రజలు గెలవడమే. ప్రజలను గెలిపించడానికి అహర్నిశలు శ్రమిస్తా.

? ఎన్నికల సమయంలో కుటుంబ వ్యవహారాలు..

నాకు తెల్లవారుజామునే నిద్రలేవడం అలవాటు, ఇంట్లో పనులు అన్నీ చూసుకొని ప్రచారానికి వెళుతున్నాను. కుటుంబ సమయం, ఎన్నికల సమయం సమన్వయం చేసుకుని పనిచేస్తున్నాం.

? ప్రచారంలో ఎదురైన ఇబ్బందులు..

ప్రతి రోజు రెండు పూటలు ప్రచారంలో పాల్గొంటున్నాను. నా భర్తను జగన్ అక్రమంగా అరెస్టు చేయించినప్పుడు కలిగిన ఇబ్బందినే తట్టుకుని నిలబడ్డా. ప్రచారంలో చిన్న చిన్న ఇబ్బందులు పెద్ద లెక్కలోనివి కాదు.

? ప్రజల నుంచి స్పందన..

ప్రజల నుంచి స్పందన చాలా బాగుంది. చక్కగా ఆదరిస్తున్నారు. ఎన్నికల్లో నా భర్త విజయం తథ్యం. జగన్‌పై ఆయన చేసిన పోరాటం ప్రజల్లో మంచి గుర్తింపు కనబడుతుంది.

? మహిళలకు ప్రయోజనాలపై ఏమి సూచిస్తారు..

నియోజకవర్గంలో మహిళలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడడంతో పాటు అన్నలా అందరికీ అండగా ఉంటారు. **- ఆకివీడు**

చింతలపూడి త్రిముఖ పోరు — సైకిల్ హవా

చింతలపూడిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇద్దరూ కొత్తవారే. సిట్టింగ్ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచారు. త్రిముఖ పోరులో టీడీపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ విజయం దిశగా దూసుకుపోతున్నారు. రోషన్‌కుమార్ పదేళ్లుగా స్థానికంగా సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువగా ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాకు వైసీపీ సీటు నిరాకరించడంతో ఆయన కాంగ్రెస్ తరపున పోటీలో నిలబడి షాక్ ఇచ్చారు. ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేసి వైసీపీ తరపున రంగంలోకి దిగిన విజయరాజు ప్రతికూల పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతతో ఎన్నికల్లో ఎదురీతే.. జనసేన, బీజేపీ సమష్టి ప్రచారంతో టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ ప్రత్యర్థి పార్టీల కంటె బలంగా ప్రజల్లోకి చొచ్చుకుపోయారు. - చింతలపూడి

పోటీలో అభ్యర్థులు

1. సొంగా రోషన్‌కుమార్	టీడీపీ
2. కంభం విజయరాజు	వైసీపీ
3. ఉన్నమట్ల రాకాడా ఎలీజా	కాంగ్రెస్
4. లక్కపాం వెంకట చైతన్య	బీఎస్పీ
5. మొవ్వల ఎస్తేరు రాణి	స్వతంత్ర
6. కలపాల ప్రసాద్	స్వతంత్ర
7. తొర్లపాటి శ్రీనివాసరావు	స్వతంత్ర
8. పచ్చిగుళ్ళ జాన్‌ధర్మరాజు	స్వతంత్ర

చింతలపూడి నియోజకవర్గం (ఎస్సీ రిజర్వుడు)
మండలాలు : చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, లింగపాలెం
మొత్తం ఓటర్లు 2,71,502
పురుషులు : 1,33,747,
స్త్రీలు : 1,37,714,
ట్రాన్స్‌జెండర్ : 41



జిల్లాలో చింతలపూడి నుంచి ప్రాతినిధ్యం వహించిన వారిలో ఎక్కువ మంది మంత్రులుగా పనిచేశారు. 2009లో ఎస్సీ రిజర్వుడ్‌గా మారింది. టీడీపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, వైసీపీ అభ్యర్థి కంభం విజయరాజు పోటీలో ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాకు వైసీపీ టిక్కెట్ నిరాకరించడంతో ఆయన కాంగ్రెస్ టిక్కెట్ పొంది పోటీలో నిలిచారు. వైసీపీ అభ్యర్థిని మార్చినంత మాత్రాన గెలుపు సాధ్యమేనా అనే చర్చ సాగుతోంది. కూటమి టీడీపీ అభ్యర్థి గత పదేళ్లుగా సేవా కార్యక్రమాలతో ప్రజల్లో ఉన్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లలో అభివృద్ధి లేకపోవడంతో ఓటర్లు జనసేన, బీజేపీ కూటమివైపు చూస్తున్నారు.

స్థానికుడు రోషన్‌కుమార్



టీడీపీ కూటమి అభ్యర్థిగా సొంగా రోషన్‌కుమార్ లింగపాలెం మండలం ధర్మాజిగూడెం గ్రామానికి చెందినవారు. అమెరికాలో పనిచేస్తూ పదేళ్లుగా మిషన్ హోప్ సంస్థ ద్వారా నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్నన పొందారు. పార్టీలో అందరినీ కలుపుకుని ఐక్యత సాధించారు. కుంటుపడిన అభివృద్ధి, అధ్వాన రహదారులు, చింతలపూడి ఎత్తిపోతల పథకం జాప్యం, వైసీపీ అవినీతిని ఎండగడుతూ జనసేన, బీజేపీలను కలుపుకుంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎన్నికల వేళ పార్టీలో చేరికలు, ఎస్సీ సామాజికవర్గంలో అందర్నీ పలుకరించి ఆకట్టుకోవడం, కుటుంబం మొత్తం ప్రచారంలో పాల్గొనడం, కూటమి మేనిఫెస్టోపై ప్రజల్లో ఆసక్తి ఆయనకు కలసి వస్తున్నాయి. ఎంపీ అభ్యర్థి పుట్టామహేష్ ఈ ప్రాంతంలో రైతులకు ఇచ్చిన భరోసా ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి చూపుతానని చెప్పడం విజయానికి కలసి వస్తున్నాయి. రోషన్ విజయం సాధిస్తారని రాజకీయ విశ్లేషకుల అంచనా.

ప్రభుత్వోద్యోగానికి రాజీనామా..



వైసీపీ అభ్యర్థి కంభం విజయరాజు స్వగ్రామం నియోజకవర్గంలోని మఠంగూడెం. ఉద్యోగరీత్యా కామవరపుకోటలో నివాసం. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నికల బరిలో దిగారు ఆయనకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జగన్ బలమే తనబలం అనే విధంగా ప్రచారం చేస్తున్నారు. గత ఐదేళ్లలో అభివృద్ధి లేదని, రోడ్లు బాగోలేదని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయలేకపోయారని రైతులు గుర్రుమంటున్నారు. వైసీపీ కార్యకర్తల్లోనూ అసంతృప్తి చోటుచేసుకుంది. జగన్ ఇచ్చిన హామీలు నెరవేరలేదు. అంతేకాక ఎమ్మెల్యేగా పనిచేసిన ఎలీలా కాంగ్రెస్ అభ్యర్థిగా తలపడుతూ వైసీపీ ఓట్లు లాగాలని తలపడటం మైనస్‌గా చెప్తున్నారు.

వైసీపీకి ఎలీజా షాక్



కాంగ్రెస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పోటీలో ఉన్నారు. అధికార వైసీపీ ఆయనకు పార్టీ టిక్కెట్ నిరాకరించడంతో పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. తనను పదవిలో ఉండగానే అవమానం పాలు చేశారని తీవ్ర మనోవేదనకు గురయ్యారు. దీంతో కాంగ్రెస్‌లో చేరి టిక్కెట్ సాధించి తన సత్తా చూపిస్తానని వైసీపీ ఓట్లు లాగడమే తన లక్ష్యమని ప్రచారంలో నూతన పంథాను ఎంచుకున్నారు. అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వకుండా తాను నియోజకవర్గంలో ఏవిధంగా అభివృద్ధి చేయగలననే ప్రచారం చేస్తున్నారు. దీంతో గత ప్రభుత్వం ఈ ప్రాంతంపై చిన్నచూపు చూసిందని ప్రజల్లోకి చేరింది. ఎలీజా వైసీపీ ఓట్లను కొంతవరకు చీల్చనున్నారు. వైసీపీకి తన సత్తా చూపడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు.

డిజిటల్ స్క్రీన్ డీజే బాక్స్

సార్వత్రిక ఎన్నికలలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు వినూత్న రీతిలో ఎన్నికల ప్రచారాలు కొనసాగిస్తున్నారు. ఆటోలు, జీపులు, రిక్షాలకు మైక్‌లను ఏర్పాటుచేసి ఎన్నికల ప్రచారం చేయడం సాధారణం. సాంకేతికత అందిపుచ్చుకుని వాహనాలకు డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. డీజే బాక్స్‌లతో హోరెత్తిస్తునాన్నరు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో డిజిటల్, డీజే ప్రచారం సాగుతోంది. డిజిటల్ సౌండ్‌తో ఎన్నికల ప్రచారం కార్యకర్తలలో హుషారు.. డీజే బాక్సులతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం 6గంటల తర్వాత ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. వీధుల్లో మైక్‌లతో హోరెత్తిస్తుండగా ఇళ్ళల్లో ఉండే సెల్‌ఫోన్‌లకు అభ్యర్థులు ఫోన్‌లు చేస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి కావడం, స్మార్ట్‌ఫోన్‌లు ప్రతి ఇంటా ఉండటంతో అభ్యర్థులు వాట్సప్ ద్వారా ప్రతి అంశం షేర్ చేస్తున్నారు. దీనికితోడు వీధుల్లో ఆయాపార్టీల ఎన్నికల ప్రచార హోరుతో ఓటర్లకు విసుగు పుడుతున్నా.. పోలింగ్‌పై ఆసక్తి కలుగుతోంది. **- ఏలూరు సిటీ / రూరల్**



ఏలూరులో టీడీపీ ప్రచారంలో యువత కురిపించిన పసుపు జల్లు





వాహనాలకు అమర్చిన డిజిటల్ స్క్రీన్‌తో గ్రామాల్లో ప్రధాన పార్టీ అభ్యర్థుల ప్రచారం



డీజే బాక్స్‌లతో ప్రచార వాహనాలు

ఎట్టెట్టా..!



ఓటు వేయకపోతే నేరమే..

మనదేశంలో ఓటు వేసినా వేయకపోయినా ఎవరూ పట్టించుకోరు. కానీ కొన్ని దేశాల్లో అయితే ఓటు వేయకపోవడాన్ని నేరంగా పరిగణిస్తారట. బెల్జియంలో ఓటు హక్కు వినియోగించని వారిని కోర్టులో హాజరుపరుస్తారు. నాలుగు పర్యాయాలు ఓటు వేయనివారికి పదేళ్లపాటు ఓటు హక్కును రద్దు చేస్తారు. అకారణంగా ఓటు వేయనివారు ప్రభుత్వ ఉద్యోగ అర్హత కోల్పోతారు. పెరూ దేశంలో ఓటువేయనివారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తారు. ఆస్ట్రేలియాలో ఓటు వేయకపోతే అందుకు తగ్గకారణం చూపాల్సిందే. లేదంటే వెయ్యి రూపాయల జరిమానా లేదా నేరస్థునిగా పరిగణిస్తారు అర్జెంటీనాలో ఓటు వేయనివారికి ప్రభుత్వ పథకాలు తొలగిస్తారు. గ్రీస్, ఈజిప్టు దేశాల్లో ఓటు వేయనివారిని కోర్టులో హాజరుపరుస్తారట. న్యాయ స్థానంలో సరైన కారణం చూపనివారిని జైలుకు పంపుతారని ఆయా దేశాల్లోని ఎన్ఆర్ఐలు చెబుతున్నారు. బొలీవియాలో ఓటువేయని ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వరట. మరి మనదేశంలో కూడా ఇలాంటివి ఏమైనా ఉంటే నూరుశాతం ఓటింగ్ జరుగుతుందేమో !

-ద్వారకాతిరుమల

ఎన్నికల బేరాలు

ఖర్చులు ఇచ్చేస్తాం..వచ్చి ఓటేసి వెళ్లండి



ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమే. అందుకే గ్రామాల నుంచి నగరాలు, పట్టణాలకు వెళ్లి ఉపాధి పొందుతున్న వలస ఓటర్లపై ప్రధాన రాజకీయ పార్టీల కన్నుపడింది. వారందరినీ తమ తమ స్వగ్రామాలకు రప్పించి పనిలో ఆయా పార్టీ నాయకులు నిమగ్నమయ్యారు. 13న జరగనున్న ఎన్నికల్లో ఓటు వేసేందుకు రావాలని రానుపోను ఖర్చులు భరిస్తామని, భోజనం, బస్సు ఛార్జీలు తదితర ఖర్చులు తమవేనంటూ ఫోన్లు చేస్తున్నారు. ముఖ్యంగా బంధువులు, కుటుంబ సభ్యుల ద్వారా గ్రామంతరం వెళ్ళిన వారి ఫోన్ నెంబర్లు సేకరించి వారితో మాట్లాడుతున్నారు. ఆయా ఫోన్ నెంబర్లకు ఫోన్‌పే, గూగుల్‌పే ఉందా అని ఆరా తీస్తున్నారు. రానూపోను వాహనాలు ఏర్పాటు చేస్తామని హైదరాబాదు, విశాఖపట్నం, చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగాల నిమిత్తం నివసిస్తున్న స్థానిక ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. వచ్చే వరకు బాగానే చూస్తారు.. కానీ వెళ్లే సమయంలో ఇబ్బందులు పడవలసి వస్తుందని కొందరు ముఖంమీదే చెబుతున్నారు..

-గణపవరం / పాలకొల్లు అర్బన్

రాజకీయం



ప్రచారంలో మాజీల జోరు

వారంతా రాజకీయ ఉద్దండులు.. ఒకరు ఐదుసార్లు పోటీ చేస్తే..మరో ఇద్దరు రెండు సార్లు పోటీ చేశారు. నియోజకవర్గంపై గట్టి పట్టు ఉన్న నాయకులు.. ప్రతి గ్రామం, వార్డుల్లో బలమైన కేడర్ ఉంది . పొత్తులో భాగంగా ఈసారి వీరికి సీటు దక్కలేదు. అయినప్పటికీ పొత్తు ధర్మాన్ని పాటిస్తూ జనసేన అభ్యర్థి విజయం కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యేలు జానకీరామ్, బండారు మాధవనాయుడులు నాయకర్ కోసం ప్రచారం చేస్తున్నారు. వీరుతో పాటు వీరి కేడర్ కూడా దిగడంతో ప్రచారం మంచి జోష్‌గా కనిపిస్తుంది.

- నరసాపురం

బెట్టింగ్..బెట్టింగ్ !



పిఠాపురం సీటుపై బెట్టింగ్‌లు..

జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న తరుణంలో అందరి చూపు పిఠాపురం వైపే ఉంది. ఎపుడూ లేని విధంగా ఈ సారి అన్ని పార్టీల నాయకులు కూడా పిఠాపురంపైనే చర్చించుకుంటున్నారు. పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారంటూ ఆచంటలోనూ జోరుగా పందాలు సాగుతున్నాయి. చంద్రబాబునాయుడు జగన్ కంటే పవన్ కల్యాణ్‌కే మెజార్టీ ఎక్కువ వస్తుందని కూడా మరో వైపు జోరుగా పందాలు సాగుతున్నాయి. దీంతో పిఠాపురం పరిస్థితిని అక్కడున్న స్నేహితులతో అడిగి సమాచారాన్ని రాబట్టుకుని మరీ బెట్టింగ్‌లు కాస్తున్నారు.

-ఆచంట

ఇదీ సంగతి !





ఒకే ఊరు.. ఒకే పార్టీ.. వేర్వేరు నియోజకవర్గాల్లో బరిలో..

వారిద్దరిదీ ఒకే ఊరు. ఒకటే పార్టీ.. వేర్వేరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన పెన్మెత్స వెంకటలక్ష్మీ నరసింహరాజు ఉండి అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగ నాథరాజు ఆచంట అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. వారిద్దరూ వైసీపీ నుంచి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. 2014ఎన్నికలలో కూడా ఇదేరీతిగా వారు పోటీచేశారు. ఆ ఎన్నికలలో నరసింహరాజు మంతెన రామరాజు చేతిలో ఓటమి చెందారు. రంగనాథరాజు పితాని సత్యనారాయణపై విజయం సాధించి మంత్రి అయ్యారు. ఈ ఎన్నికల్లో ఉండి నుంచి తెలుగుదేశం నుంచి కనుమూరు రఘురామకృష్ణరాజు (ఆర్ఆర్ఆర్) పోటీ చేస్తున్నారు. మరి ఓటర్లు ఈసారి ఎటువంటి తీర్పు ఇస్తారో వేచి చూడాలి.

-ఉండి

పార్టీ కండువాలకు గిరాకీ



ప్రస్తుతం పార్టీల కండువాలకు ఉన్న గిరాకీ అంతా ఇంతా కాదు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సంబంధించిన కండువాలకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. ఒకపార్టీ నుంచి మరో పార్టీలోకి చేరేవాళ్లకు, ప్రచా రంలో తిరిగే కార్యకర్తలకు ఇచ్చేందుకు, ర్యాలీలలోను, బహిరంగ సభలలోను వేసుకునేందుకు కండువాలు ఉండాలి. ఎన్నికల ప్రధాన సామగ్రిగా ఈ కండువాల హవా సాగుతోంది. అభ్యర్థులు లక్షలాది రూపాయలు వెచ్చించి ఈ కండువాలను కొనుగోలు చేస్తున్నారు. సగటున పార్టీ గుర్తున్న ఒక్కో కండువా రూ.30 నుంచి రూ.40ల వరకూ ఉంటుందని చెబుతున్నారు. "మా దగ్గర వివిధ పార్టీల కండు వాలు దొరుకుతాయి... సంప్రదించండని స్థానిక వాట్సాప్ గ్రూపులలో వస్త్ర వ్యాపారులు ప్రకటనలు కూడా ఇస్తున్నారు. ఈ కండువాలకే ఒక్కో అభ్యర్థికి లక్షలాది రూపాయల్లో చమురు వదులుతున్నట్లు సమాచారం.

-ద్వారకా తిరుమల

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి
DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

డాబా ఇల్లు అమ్మకం

జంగారెడ్డిగూడెం సుబ్బారెడ్డి కాలనీ, ప్రతిభ కాన్వెంట్ వెనుక వీధిలో 400 చ.గ.స్థలంలో E/F రెండంతస్థుల డాబా ఇల్లు అమ్మకానికి కలదు. కాంటాక్ట్ నెం: 9441037735.

Ajd:177187

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారించి క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పవర్ లేని పదవులు



- మూడేళ్లు గడిచినా నిధులు..విధులు లేవు
- స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల ఆవేదన
- ఉత్సవ విగ్రహాల్లా ఎంపీటీసీ సభ్యులు
- కనీస గౌరవం కూడా లేదంటున్న సర్పంచ్‌లు

ఏలూరు రూరల్, మే 9: గ్రామీణ ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ఎన్నికల్లో గెలిచిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర అన్యాయం జరిగింది. తమ పరిధిలోని ప్రజలకు సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్న ఆశలపై వైసీపీ ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఎన్నికై మూడేళ్లు కావస్తున్నా నిధులు, విధులు లేకపోవడంతో ఆ పార్టీలోని ప్రజా ప్రతినిధులు తీవ్ర నిరాశకు గురయ్యారు. కనీసం ప్రభుత్వ కార్యాలయాల్లో గౌరవమైనా దక్కుతుందా అంటే అది కడా లేకుండా పోయింది. దీంతో విజయం సాధించామన్న సంతోషం కంటే ప్రజలకు ఏమీ చేయలేక పోతున్నామనే బాధ వారిలో ఎక్కువ కనిపిస్తోంది. 2021, ఫిబ్రవరి 21న పంచాయతీలకు, అదే ఏడాది ఏప్రిల్ 8న ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఎక్కువ పంచాయతీలు వైసీపీ దక్కించుకుంది.

నిధులు లేవు.. విధులు లేవు

పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులుగా గెలిచి మూడేళ్లు అవుతున్నా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేకపోయారు. నిధులు లేవు.. విధులు లేవు.. గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో ప్రజలతో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు పనిలేకుండా పోయింది. ప్రతీది వారి ద్వారా జరుగుతుండటంతో పంచాయతీ కార్యాలయాల్లో దిష్టిబొమ్మల్లా కూర్చోవడం తప్ప చేసేదేమీ లేదని పలువురు పేర్కొంటున్నారు. ఎంపీటీసీల పరిస్థితి మరీ ఘోరంగా మారింది. వారికి విధులు, నిధులు మాట అటుంచి పంచాయతీ కార్యాలయంలో కూర్చొందామంటే ప్రత్యేకమైన కుర్చీ కూడా లేదు. మండల పరిషత్ సమావేశాల్లో ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకువెళ్ళినా వాటిని పరిష్కరించిన దాఖలాలు లేవు. ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు.

పదవి ఉన్నా లేనట్లే

మండల పరిషత్‌కు గతంలో బి.ఆర్.జి.ఎఫ్ తలసరి గ్రాంటు, జనరల్ ఫండ్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఆర్థికసంఘం నిధులు సమకూరేవి. దీంతో గ్రామాల్లో డ్రెయిన్లు, సీసీ రోడ్లు, అంతర్గత రోడ్లు నిర్మాణ పనులు చేపట్టేవారు. ప్రస్తుతం నిధులు ఎంపీటీసీల ప్రమేయం లేకుండా నేరుగా గ్రామ పంచా యతీలకు ఇస్తుండటంతో వారికి కనీస గౌరవం లేకుండా పోయింది. 15వ ఆర్థికసంఘం నిధులు నుంచి 20 శాతం ఎంపీటీసీలకు ఇవ్వాల్సిందిగా కేంద్రం సూచించినా రాష్ట్రం ఇవ్వడం లేదు. పదవి ఉన్నా ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేకపోతున్నామని వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వాపోతున్నారు.

నిధుల కోసం వినతులు

ఏదో రకంగా హామీలను నిలబెట్టుకుని ప్రజల్లో గౌరవం పొందాలనుకున్న ఎంపీటీసీలకు వైసీపీ ప్రభుత్వంలో అడుగడుగునా నిరాశే ఎదురవుతోంది. గ్రామంలో వారికి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాని వినతులు ఇస్తున్నా పట్టించుకునే నాధుడే లేడు.కనీసం సీసీ రోడ్లు, డ్రైన్‌లు ఏర్పాటు చేద్దామన్నా నిధులు లేవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మండల పరిషత్‌కు పెద్దగా నిధులు మంజూరు కాకపోవడం, సాధారణ నిధులు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో వారు ఏ పనీ చేయలేకపోతున్నారు. గత టీడీపీ హయాంలో ఎంపీటీసీలకు కొంతవరకు నిధులు కేటాయించడంతో కొన్ని పనులు చేశారు. వైసీపీ హయాంలో ఒక్క పైసా కూడా విదల్చకపోవడంతో ఆవేదనకు గురవుతున్నారు.

ఓట్లు ఎలా అడగాలి దేవుడా !

ఆందోళన చెందుతున్న సర్పంచ్‌లు



వైసీపీ ప్రభుత్వ హయాంలో వందలాదిమంది సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి పనులు చేసినా తమ పరపతి పోయిందని వాపోతున్నారు. సర్పంచ్‌గా గెలిచి ఊరుకి రోడ్లు, అభివృద్ధి పనులు చేస్తామని చెప్పి చివరికి నిధులు రాక అప్పులు చేసి, వ్యవసాయ భూములు అమ్ముకుని పైసా లేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎన్నికలు రావడంతో ప్రజల్లోకి ఎలా వెళ్లాలి ? ఓట్లు ఎలా అడగాలని మదన పడుతున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు మాత్రం ఎలాగైనా ఈసారి గెలిపించాలని సర్పంచ్‌లను బతిమలాడు తున్నారు. వివిధ మండలాల్లోని కొందరు సర్పంచ్‌లు తమ వ్యవసాయ భూములు తాకట్టుపెట్టగా మరికొందరు రూ.లక్షల్లో అప్పులు చేసి పనులు చేశారు. చేసిన పనులకు బిల్లులు రాక తీవ్రంగా ఇబ్బంది పడుతూ తెలిసినచోట పరువు పోతుందని వడ్డీలు కడుతున్నారు. కొందరైతే బంగారు నగలు విక్రయించి అప్పులు తెచ్చారు. ఐదేళ్ళుగా నాయకత్వం వహించేవారు సర్పంచ్‌లను పట్టించుకోలేదు. మీకు అండగా ఉంటామని చెప్పిన నాయకులు తర్వాత కనిపించకుండా పోయారు. ఇప్పుడు వచ్చి ప్రజలను ఓట్లు అడగమంటే ఏ ముఖం పెట్టుకుని అడగాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకుల తీరుతో విసిగిపోయిన కొందరు సర్పంచ్‌లు చాపకింద నీరులా కూటమి అభ్యర్థులకు మద్దతు పలుకుతున్నారు.

సమస్యలు అప్‌గ్రేడ్

నగర పంచాయతీలుగా మారినా తొలగని సమస్యలు

పెరిగిన పన్నులు..కనిపించని అభివృద్ధి

అధికారుల పాలనలోనే చింతలపూడి

జనాభా పెరిగింది..అవసరాలు పెరుగుతున్నాయి.. మేజర్ పంచాయతీలను నగర పంచాయతీలుగా మారిస్తే అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని భావించి ఈ రెండు పంచాయతీలను అప్‌గ్రేడ్ చేశారు. అయితే నగర పంచాయతీలుగా మారినా ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. ఆకివీడు, చింతలపూడి నగర పంచాయతీల్లో సమస్యలు ఇంకా అనేకం దర్శనమిస్తున్నాయి. పెరిగిన పన్నులు చెల్లించలేక ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. - ఏలూరు సిటీ



ఇది పట్టణంలోని అనధికార డంపింగ్‌యార్డు.. కొన్ని సంవత్సరాలుగా చెత్త సమస్యకు పరిష్కారం లేక పట్టణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు..

ఆకివీడు..అదే తీరు

ఆకివీడు నగర పంచాయతీ 2020 జనవరి 28న ఏర్పాటైంది. 2020 నవంబరులో ఎన్నికలు జరిగాయి. 20 వార్డులతో నగర పంచాయతీ ఏర్పాటైంది. అప్పటివరకు మేజర్ పంచాయతీగా ఉన్న ఆకివీడు నగర పంచాయతీగా మారింది. 40 వేల జనాభా ఉన్న ఆకివీడు నగర పంచాయతీలో 24 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. అయితే ఇప్పటికీ ఇక్కడ సౌకర్యాలు లేమి కనిపిస్తోంది. గతంలో ఉన్న సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. నగర పంచాయతీ అయిన తర్వాత పన్నులు మాత్రం విపరీతంగా పెంచేశారు. ఇళ్ల అద్దెలు పెరిగాయి. తాగునీరు, సాగునీరు, డ్రెయినేజీ, పారిశుధ్యం ఇక్కడ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. డంపింగ్ యార్డ్ దీర్ఘకాలిక సమస్యగా ఉంది. గత ప్రభుత్వ హయాంలోనే ఇక్కడ సీసీ రహదారులు వేశారు. వార్డుల్లో అంతర్గత రహదారుల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. తాగునీటి సమస్య జటిలంగా తయారైంది. ఇప్పటికీ ఏడాది పొడవునా కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సిన దుస్థితి ఉంది.సమస్యలు నిత్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నా వాటిని పరిష్కరించే నాథుడే లేకపోయారు. ఇక్కడ కనీస వనరులు, సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. నగర పంచాయతీకి తగ్గట్టుగా అధికారుల నియామకం జరగలేదు. ఇప్పటికే ఈ నగర పంచాయతీకి సంబంధించి ఏడుగురు కమిషనర్లు మారారు. సాధారణంగా నగర పంచాయతీ ఏర్పాటైన తర్వాత అధికారులను నియమించాల్సిన ప్రభుత్వం నేటికీ పూర్తిస్థాయిలో నియామకాలు చేపట్టలేదు. ఇప్పటికీ కమిషనర్‌తో పాటు మరో అధికారి (మేనేజర్) మాత్రమే ఇక్కడ విధులు నిర్వహి స్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో లేక సాధారణ పరిపాలనా వ్యవహారాలు కూడా సక్రమంగా జరగడం లేదు. ఇక రాబోయే ప్రభుత్వం అయినా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకివీడు నగర పంచాయతీ వాసులు కోరుకుంటున్నారు.



చింతలపూడి



పట్టణంలో 2008లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు..2009 తర్వాత అవి వెలిగిన పాపాన పోలేదు.. ఇప్పటికీ ప్రధాన రోడ్డు రాత్రయితే చీకట్లో మగ్గుతోంది..

చింతలు తీరలేదు

చింతలపూడి నగర పంచాయతీ ఏర్పాటై మూడేళ్లయింది. 2021 జనవరి 1వ తేదీన 20 వార్డులతో ఈ నగర పంచాయతీ ఏర్పాటు జరిగింది. ఇప్పటికీ ఈ పంచాయతీ అధికారుల పాలనలోనే కొనసాగుతోంది. ఇప్పటికే నలుగురు కమిషనర్లు మారటం, పూర్తి స్థాయిలో అధికారులను నియమించక పోవడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. సిబ్బంది అంతంత మాత్రంగానే ఉండడంతో చింతలపూడి పంచాయతీలో నిత్యం సమస్యలు దర్శనమిస్తూనే ఉన్నాయి. 2009 నుంచి ఇక్కడ సెంట్రల్ లైటింగ్ సమస్య వెంటాడుతోంది. బల్బులే పాడైపోయాయి.. లారీలు ఢీకొనడంతో కొన్ని స్తంభాలు ధ్వంసమయ్యాయి. పట్టణ ప్రధాన రహదారి చీకటిలోనే మగ్గుతోంది. నగర పంచాయతీకి ఇవ్వాల్సిన సౌకర్యాలు నేటికీ ఏర్పాటు కాలేదు. పారిశుధ్య సమస్యతో చింతలపూడి కొట్టుమిట్టాడుతోంది. 35 వేల జనాభా ఉన్న ఈ నగర పంచాయతీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు ఏర్పాటు కాలేదు. డ్రెయినేజీ సమస్యలు జటిలంగా ఉండడంతో కాస్తంత వర్షం కురిసినా పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండి పారిశుధ్య సమస్య ఏర్పడుతోంది. సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినా ఇప్పటివరకు ఏర్పాటు కాలేదు. గతంలో మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు ఎలా ఉందో నగర పంచాయతీగా ఏర్పాటు అయిన తర్వాత కూడా అదే పరిస్థితులు ఉన్నాయి. ఐదు సచివాలయాలు ఉన్నా సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. తాగునీటి సమస్య ఇప్పటికీ కొన్ని వార్డుల్లో కనిపిస్తోంది. రాబోయే ప్రభుత్వం అయినా చింతలపూడి నగర పంచా యతీలో ఎన్నికలు నిర్వహించి పాలక వర్గాన్ని ఏర్పాటు చేసి తమ సమస్యలు పరిష్కరించాలని చింతలపూడి నగర పంచాయతీ వాసులు కోరుకుంటున్నారు.



ఏలూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



కొత్తూరు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదుతో సిబ్బంది



జంగారెడ్డిగూడెం వద్ద పట్టుకున్న మద్యం

విస్తృతంగా తనిఖీలు

నగదు..మద్యం స్వాధీనం

ఏలూరు ఎస్పీ ఆకస్మిక తనిఖీ

ఏలూరు క్రైం, మే 9 : సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితి తెలుసుకునేందుకు జిల్లాలో తనిఖీలు చేపట్టారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 26.3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు నాలుగు లక్షల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పెదపాడు పోలీస్ స్టేషన్‌ను గురువారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించారు. రాత్రి వేళ గస్తీ పోలీసుల బీట్లను కూడా పరిశీలించారు. అల సత్వం లేకుండా విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల ట్రబుల్ మంగర్స్, రౌడీషీటర్లను వెంటనే బైండోవర్ చేయాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలని నాన్ బెయిలబుల్ వారెంట్లను అమలు చేయాలన్నారు. సాయుధ దళాలతో రూటు మార్చ్ నిర్వహించి ప్రజలకు నిర్భయంగా ఓటు వినిగించుకునే భరోసా కల్పించాలన్నారు. గ్రామాలకు వచ్చిపోయే అనుమానిత, కొత్త వ్యక్తుల సమాచారం సేకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటించాలన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే సి-విజిల్ యాప్ ద్వారా లేదా టోల్ ఫ్రీ నెంబర్ 112కు కాల్ చేయాలని సూచించారు.ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, పెదపాడు ఎస్ఐ సుభాకర్ ఉన్నారు.

60 లీటర్ల సారా, 84.75 లీటర్ల మద్యం స్వాధీనం

జిల్లా ఎస్పీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా ఎస్ఇబి అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం ఎస్ఈబీ బృందాలు దాడులు నిర్వహించాయి. గురువారం జిల్లాలోని చింతలపూడి, భీమడోలు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఇబి పోలీస్ స్టేషన్ అధికారులు, చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. సారా తయారీ, విక్రయ దారులపై 2 కేసులు నమోదులు చేసి వారి నుంచి 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 2 వేల లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసి 1 కేసు నమోదు చేశారు. డ్యూటీపెయిడ్ లిక్కర్ కల్గి ఉన్నవారిపై 8 కేసులు నమోదు చేసి 84.75 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. 14 కేసుల్లో 13 మందిని అరెస్టు చేశారు. ఏడు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి 11 మందిపై బైండోవర్ కేసులు, రెండు మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్పీ తెలిపారు.

స్కూటీలో 100 మద్యం బాటిళ్లు

బుట్టాయగూడెం : అక్రమంగా తరలిస్తున్న 100 మద్యం సీసాలను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ వై.పట్టాబి చౌదరి, సీఐ రాజేష్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పరిధిలోని జంగారెడ్డిగూడెం-కొయ్యలగూడెం బైపాస్ రహదారిపై బైనేరు వంతెన వద్ద స్కూటీలో 100 మద్యం సీసాలను తీసుకు వెళుతుండగా తనిఖీ చేసి పట్టుకున్నామన్నారు. చెమటపల్లి సుధీర్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.2.70 లక్షలు సీజ్

కామవరపుకోట : కొత్తూరు చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలలో రెండు లక్షల 70 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల చెక్‌పోస్టు అధికారి ఎండీ మొహిద్దీన్ తెలిపారు.వీరిశెట్టిగూడెనికి చెందిన కారులో వెళుతున్న వ్యక్తి నుంచి రూ.2 లక్షలు, రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన వ్యక్తి కారు నుంచి 70 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసలు వీరాస్వామి, కె.రమేష్, రామకృష్ణ సూర్యా రావు, నాగూర్, నాగార్జున, వీఆర్వో బాబూరావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంబీఎస్ శర్మ

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం

ఏపీ బ్రాహ్మణ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంబీఎస్ శర్మ

ఏలూరు టూటౌన్, మే 9: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని ఏపీ బ్రాహ్మణ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంబీఎస్ శర్మ పిలుపునిచ్చారు. బ్రాహ్మణ ఫెడరేషన్ కార్యాలయంలో గురువారం బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శర్మ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నాశనం అయిందన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, కార్మికులు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.జగన్ ప్రభుత్వంలో ఆర్థిక క్రమశిక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి బ్రాహ్మణులకు తీరని ద్రోహం చేశారన్నారు. బ్రహ్మణ సంక్షేమం హిందూ, దేవాలయాల పరిరక్షణ ధ్యేయంగా ఎన్‌డీఏ కూటమి మేనిఫెస్టోలో బ్రాహ్మణ సమాజంలో పేదరికం నిర్మూలించ వచ్చన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణ సమాజం యావత్తు టీడీపీ కూటమికి మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. అర్చక, పురోహిత సంఘ నాయకులు బృందావనం చక్రవర్తి, బీజేపీ నాయకులు గురుప్రసాద్, టీడీపీ బ్రాహ్మణ సంఘ నాయకులు కుమార భాస్కరశర్మ, హరిమాధురి, చందూరి దివ్య తదితరులు పాల్గొన్నారు.

12,13 తేదీల్లో పత్రికా ప్రకటనలపై ముందస్తు అనుమతి తప్పనిసరి : కలెక్టర్

ఏలూరు సిటీ, మే 9 : పోలింగ్ రోజు, పోలింగ్ ముందురోజు అనగా ఈనెల 12, 13 తేదీల్లో పత్రికలలో వచ్చే ప్రకటనలకు పోటీ చేసే అభ్యర్థులు రెండు రోజులు ముందుగా ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. పత్రికల యాజమాన్యాలు కూడా ఎంసీఎంసీ ధ్రువీకరణ ముందస్తు అనుమతి లేకుండా తమ పత్రికల్లో రాజకీయ పార్టీల, అభ్యర్థుల ప్రకటనలు ప్రచురించరాదని కోరారు. పోటీ చేసే అభ్యర్థి, పార్టీ తరపున వేరొక సంస్థ లేదా వ్యక్తి ఇచ్చే వాటికి కూడా ఇది వర్తిస్తుందని తెలిపారు.

రేపు.. ఓటుహక్కు వినియోగంపై ముగ్గుల పోటీలు


ఏలూరులో స్థల పరిశీలన చేస్తున్న డీపీవో తూతిక శ్రీనివాస్‌విశ్వనాథ్

ఏలూరు రూరల్, మే 9: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వినియోగం అనే అంశంపై ఈనెల 11న ఉదయం తొమ్మిది నుంచి పదకొండు గంటల వరకు సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు స్వీప్ నోడల్ అధికారి, డీపీవో తూతిక శ్రీనివాస్‌విశ్వనాథ్ తెలిపారు. గురువారం జిల్లా అధికారుల బృందం ఆ కళాశాలలో స్థల పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లలో చైతన్యం పెంచేదిశగా అవగాహన కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నామని దీనిలో భాగంగానే ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోటీలో పాల్గొనే మహిళలు ముందుగా 98499 03321 నంబరుకు ఫోన్‌చేసి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రథమ బహుమతిగా రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు చొప్పున జిల్లా కలెక్టర్ చేతులమీదుగా నగదు ప్రోత్సాహం అందిస్తామన్నారు. రంగులు, ఇతరత్రా సామగ్రి వారే సమకూర్చుకోవాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు, ఐసీడీఎస్ పీడీ కె.పద్మావతి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

18న పట్టిసీమ ఫెర్రీ రేవు బహిరంగ వేలం

పోలవరం, మే 9 : పట్టిసీమ ఫెర్రీ రేవు బహిరంగ వేలం ఈనెల 18న నిర్వహిస్తామని పట్టిసీమ పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టిసీమ ఫెర్రీ రేవులో 2024-25 సంవత్సరాలకు పడవ నడుపుటకు, వాహనాల పార్కింగ్ నిర్వహణకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. పాటదారులు ఫెర్రీ రేవులో పడవ నడుపుటకు రూ.5 లక్షల సాల్వెన్సీతో రూ.2,50,000 దరావత్తు, వాహనాల పార్కింగ్ కోసం లక్ష రూపాయల సాల్వెన్సీతో రూ.50 వేల దరావత్తు చెల్లించాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి పట్టిసీమ ఫెర్రీ రేవులో పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలం నియమ నిబంధనలు కార్యాలయ పనివేళల్లో కార్యదర్శిని అడిగి తెలుసుకోవాలని సూచించారు.

'బీఎల్‌వోలకు నిధులు మంజూరు చేయాలి'

ఏలూరు రూరల్, మే 9 : రెండేళ్ల నుంచి ఎన్నికల విధుల్లో ఉన్న బీఎల్‌వోలకు రావాల్సిన నిధులు మంజూరు చేయాలని వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతిసారి కిందిస్థాయి వీఆర్వోలతో ఎన్నికల సమయంలో డబ్బులు ఖర్చుపెట్టించి నిధులు ఇవ్వడం లేదన్నారు. రెండేళ్ళ నుంచి బీఎల్‌వోలకు రావాల్సిన నిధులు ఇప్పటికే అందలేదన్నారు. ఇదే విషయంపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసి వినతిపత్రం అందజేసినా నేటికీ నిధులు మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. ఎన్నికల పోలింగ్‌బూత్‌ల వద్ద షామియానా, కుర్చీలు, మంచినీరు, భోజనం, ఇతర సదుపాయాలకు సంబంధించి అధికారులు ఆదేశాలు ఇస్తున్నారే తప్ప నిధులు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఎల్‌వోలకు రావాల్సిన బకాయిలు తక్షణం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

17 మంది వలంటీర్ల రాజీనామా

లింగపాలెం, మే 9 : లింగపాలెం మండలంలో 17 మంది వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో రాంబాబు గురువారం తెలిపారు. మండలంలోని రంగాపురం, కె.గోకవరంతో సహా పలు గ్రామాల్లోని 17మంది వలంటీర్లు వారి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు వారు తెలిపారని ఎంపీడీవో అన్నారు.

వైసీపీ నుంచి పలు కుటుంబాలు టీడీపీలో చేరిక


రాజుపోతేపల్లిలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

టి.నరసాపురం, మే 9: రాజుపోతేపల్లి గ్రామంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు ఆధ్వర్యంలో నల్లూరి వెంకటేశ్వరరావుతో పాటు 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో గురువారం చేరాయి. టీడీపీ పోలవరం నియోజకవర్గం ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు వారికి పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్డీయే కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలవరం జనసేన పార్టీ అభ్యర్థి చిర్రి బాలరాజు ఎన్నికల గుర్తు గాజుగ్లాసు, టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ ఎన్నికల గుర్తు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. నాయుడు రామకృష్ణారావు గౌడ్, బొంతు సత్యనారాయణ, వెలిది నాగబాబు, గుమ్మళ్ళ బాలరాజు, టీవీ శ్రీనివాసరావు, బండి శ్రీనివాసరావు, చిలకా బాలయ్య తదితరులు పాల్గొన్నారు. టి.నరసాపురంలో జయవరపు శ్రీరామమూర్తి, జనసేన టీడీపీ నాయకులు, పలువురు ముఖ్యనాయకులు పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు కలిశారు.

ఉండవల్లి కమలావతికి పలువురి నివాళి


కమలావతి చిత్రపటం వద్ద రెడ్డి సుబ్రహ్మణ్యం, గన్ని నివాళులు

భీమడోలు, మే 9 : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ ప్రధాన కార్యదర్శి ఉండవల్లి బాలానందం మాతృమూర్తి కమలావతికి అమలాపురం పార్లమెంటు అధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు నివాళులర్పించారు. గురువారం కురెళ్ళగూడెంలో ఈ మేరకు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ నేత పుప్పాల హరి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం అవినీతిమయం : ఘంటా మురళి

లింగపాలెం/కామవరపుకోట, మే 9:రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అవినీతిమయమని, నియోజకవర్గాల్లో నామమాత్రపు పనులు కూడా చేయించలేని వ్యక్తులు టీడీపీ ప్రభుత్వంపై అబాండాలు వేస్తూ మాట్లాడడం ఆశ్చర్యం వేస్తుందని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ అన్నారు. లింగపాలెం మండలం తువ్వచిలుకరాయుడుపాలెం గ్రామంలో బుధవారం రాత్రి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్‌తో పాటు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కాల్వ డిజైన్ చేసి రూ.1700కోట్లతో ఆనాటి ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించానని, అనంతరం చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే రూ.1700కోట్లను 5 వేల కోట్లకు పెంచి కాల్వ పనులు పూర్తిచేశారని, 3,500 కోట్లతో పనులు పూర్తిచేశారన్నారు. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం వచ్చాకమిగిలిన పనులను ఆపివేసిందన్నారు. కామవరపుకోట మండలం కళ్లచెరువు గ్రామంలో గురువారం రాత్రి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ నమూనా బ్యాలెట్‌లతో ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, కూటమి శ్రేణులు తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీవారి వైశాఖ బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అశ్వవాహనంపై అమ్మవార్లతో శ్రీవారి ఊరేగింపు

ఏలూరు కార్పొరేషన్, మే 9: రామచంద్రరావు పేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం వైశాఖ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని, శ్రీవారిని విశేషంగా అలంకరించారు. అశ్వ వాహనంపై ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, యాజ్ఞబ్రహ్మ కిళాంబి వెంకట పవన్ కృష్ణమాచార్యులు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ఈవో నగం సన్యాసిరావు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈనెల 14 వరకు వైశాఖ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఈవో తెలిపారు.

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

» ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ » ఉత్సాహంగా ర్యాలీ, రోడ్ షో

ముదినేపల్లి, మే 9:ఏలూరు లోక్‌సభ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, అందుకు రానున్న ఎన్నికల్లో తాను ఘన విజయం సాధించేందుకు ఓటర్లు ఆశీర్వదించాలని ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ కోరారు. ముదినేపల్లి మండలంలో గురువారం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి భారీ ర్యాలీతో రోడ్ షో నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతోపాటు కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఏలూరు లోక్‌సభ నియోజక వర్గ పరిధిలో పారిశ్రామికాభివృద్ధికి ఎన్నో వనరు లు ఉన్నాయి. సహజ సిద్ధమైన కొల్లేరు సరస్సు తీరం ఉంది. లక్షలాది మంది యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు, వీటన్నింటికీ శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కొల్లేరు ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా, వ్యవసాయం, దాని అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్, రాష్ట్ర కార్యదర్శి కొత్తా నాగేంద్ర కుమార్, నాయకులు బీఎంకే నాని, ఈడ్పుగంటి శ్రీనివాస్, కొత్తూరు విఠల్, చలసాని జగన్మోహనరావు, పూల రాజీ, దావు నాగరాజు, బొంగు రవికుమార్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పైడిపాటి శివశంకర్, యర్రా నాని, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, మోటే పల్లి హనుమ, మదన్ మోహన్, బాసినశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ర్యాలీ, రోడ్ షో..

ఏలూరు కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ఎన్నికల ప్రచార ర్యాలీ, రోడ్ షో కోలాహలంగా సాగింది. ముదినేపల్లి మండలం దాకరం వద్ద ప్రారంభమైన భారీ ర్యాలీ పేరూరు, పెయ్యేరు, ముదినేపల్లి, వడాలి, చిగురుకోట, బొమ్మినంపాడు, పెదగొన్నూరు, దేవపూడి గ్రామాల మీదుగా వైవాక చేరింది. నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కొడాలి వినోద్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

వైసీపీ మాటలకు మోసపోకండి : పుట్టా

మండవల్లి, మే 9: అధికార వైసీపీ అధికారాన్ని కాపాడుకునేందుకు వైసీపీ నేతలు చేస్తున్న మాయమాటలను నమ్మి మోసపోవద్దని ఏలూరు కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండవల్లి మండలం మణుగులూరు, కొవ్వాడలంక, పుల్లపర్రు సెంటర్, కాకతీయ నగర్, లోకుముడి, భైరవపట్నం, మండవల్లి, పెరికేగూడెం, కానుకొల్లు గ్రామాల మీదుగా మహేష్ రోడ్‌షో గురువారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రధాన కూడలిలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులను దోచుకునేందుకు, అధికారాన్ని కాపాడుకునేందుకు వైసీపీ నేతలు దొడ్డిదారిన ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని, వాటిని నమ్మి మోసపోవద్దని కోరారు. రానున్నది కూటమి ప్రభుత్వమేనని ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రజలకు అందుబాటులో ఉంటామని ప్రజలు గ్రహించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బీకేఎం నాని, నారగాని నాగేశ్వరరావు, ముళ్ళపూడి సత్తిబాబు పాల్గొన్నారు. మణుగులూరు గ్రామంలో కైకలూరు బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని మహేష్ కుమార్‌యాదవ్ చేశారు.


మణుగులూరులో కామినేనితో కలిసి పుట్టా మహేష్‌యాదవ్ ప్రచారం


ఏలూరు మెయిన్‌బజార్ ప్రజాసంకల్పయాత్రలో బడేటి చంటి, హోటల్‌లో ప్రచారం చేస్తున్న దృశ్యం

రానున్నది కూటమి ప్రభుత్వమే

» ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరు టూటౌన్, మే 9: మరికొన్ని రోజుల్లో వైసీపీ రాక్షస పాలన అంతమొంది కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని టీడీపీ, బీజేపీ, జనసేన ఏలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. గురువారం ఏలూరు 13వ డివిజన్‌లో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ ఒక్కర్ని కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి గెలుపు ఖాయమని తెలిసి అధికార పక్ష నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని చేసిన ప్రజల మనస్సులో బడేటి కుటుంబానికి ప్రత్యేక స్థానముందన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. వన్‌టౌన్‌లో ని వ్యాపారులు తాము పడుతున్న ఇబ్బందులను చంటికి వివరించారు. కూటమి ప్రభుత్వం రాగానే సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామన్నారు. సాయంత్రం 30వ డివిజన్ చాణుక్యపురి కాలనీలో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, ఎంఆర్‌డీ బలరామ్, కొట్టు మనోజ్, కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరిస్తా

» చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్


కనిపెడలో ప్రచారం చేస్తున్న సొంగా రోషన్‌కుమార్, మాజీ మంత్రి ఉమాతో సొంగా

చింతలపూడి, మే 9: బాలువారిగూడెం రోడ్డు వేయిస్తానని, దళితవాడలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీల సమస్యలు పరిష్కారిస్తానని చింతలపూడి కూటమి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ హామీ ఇచ్చారు. మండలంలోని తెలే సోమవరం, కనిపెడ, బాలువారిగూడెం, బొర్లగూడెం, లింగగూడెం, గురుపట్లగూడెం, ఎండపల్లి, మల్లేశ్వరం, గుళ్లపాడు, శివపురం, పోతునూరు గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులతో ఆయనకు స్వాగతం పలికారు. అసెంబ్లీ, పార్లమెంట్ రెండు ఓట్లు సైకిల్ గుర్తుకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, సర్పంచ్ కొండుబోయిన యువరాజు, కంభం రమేష్, నందిగం నాగేశ్వరరావు, కె.రాజారెడ్డి, కోండ్రు దేవ, బాలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం : ఉమా

కూటమి ప్రభుత్వంరాగానే పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పోలవరం ప్రచారానికి వెళుతూ చింతలపూడి పార్టీ కార్యాలయంలో కొద్దిసేపు ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాగానే రెండేళ్ళలోనే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి పాల్గొన్నారు.

బాబు పాలనలోనే ప్రజలకు సమన్యాయం

» గోపాలపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు


గుళ్లపాడులో మద్దిపాటిపై పూల వర్షం

ద్వారకాతిరుమల, మే 9: జగన్ పాలనతో విసిగి వేసారిన ప్రజలు కూటమిని గెలిపించి, చంద్రన్న సంక్షేమ పాలనను అందుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారని గోపాలపురం టీడీపీ కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు బుట్టాయిగూడెం, గుళ్లపాడు, జి.కొత్తపల్లి ఎస్సీకాలనీ, గొడుగుపేట తదితర గ్రామాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో ప్రజలకు చంద్రబాబు ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీ కూటమికి ప్రజలు పట్టం కట్టాలని, చంద్రబాబు పాలనలోనే ప్రజలకు సమన్యాయం జరుగుతుందని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని భరోసా నిచ్చారు.

నియంతపాలనకు చరమగీతం పాడాలి

» టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల


అర్థవరం రోడ్డుషోలో ఎంపీ అభ్యర్థి పుట్టా, ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల, గన్ని

గణపవరం, మే 9: ఐదేళ్ల నియంతపాలనకు చరమగీతం పాడి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు జరుగుతున్న ఎన్నికలు అత్యంత కీలకమని ప్రజలు గ్రహించాలని టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, ఉంగుటూరు జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు కోరారు. గురువారం రాత్రి మండలంలోని గణపవరం, సరిపల్లె, వరదరాజపురం, వల్లూరు, ముగ్గళ్ళ, అర్థవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అడ్డేపల్లి వాసురాజు నేతృ త్వంలో కూటమి శ్రేణులు, ప్రజలు గణపవరం సెంటర్‌లో క్రేన్ సాయంతో భారీ గజమాలతో స్వాగతం పలికారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. జనసేన సమన్వయకర్త పవన్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, అడ్డేపల్లి వాసురాజు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, పాతపాటి రామకృష్ణంరాజు, కాపారం చిన్న, తోట శ్రీనివాసరావు, కూసంపూడి జగపతిరాజు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, మే 9 : నిర్మాణం అవుతున్న భవనం వద్ద కాపలా ఉంటున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి పడి తలకు బలమైన గాయమై మృతి చెందాడు. ఏలూరు శేఖర్‌వీధికి చెందిన ఆళ్ళ శ్రీను(40)కు భార్య నాలుగేళ్ళ క్రితం గొడవ పడి మరణించింది. అతడికి ఇద్దరు పిల్లలు ఉండగా వారు తల్లి మరణించిన తరువాత బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. అప్పటి నుంచి శ్రీను ఒంటరిగా ఉంటూ తాపీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఏలూరు ఎన్‌ఆర్‌పేటలో ఓ వ్యక్తి కొత్త ఇల్లు నిర్మాణం చేస్తుండగా పగలు పనులు చేసి రాత్రి కాపలాగా ఉంటున్నాడు. గురువారం సాయంత్రం నిర్మాణమవుతున్న భవనం మెట్లపై నుంచి జారిపడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు త్రీటౌన్ పోలీసులకు అందడంతో సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ప్రసాద్, రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, మే 9 : ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి సమీపంలోని జాతీయ రహదారి బ్రిడ్జి కింద గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం ఉందని ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందింది. రూరల్ ఎస్‌ఐ కె.రాజారెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆ మృతదేహం వృద్ధుడిదని, గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడం వల్ల మరణించి ఉంటాడని ప్రాథమికంగా భావించారు. సుమారు 60-70 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉన్నాడని తెలిపారు. 15 రోజుల నుంచి ఆ ప్రాంతంలో షాపుల వద్ద భిక్షాటన చేస్తూ జీవించాడని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్‌ఐ 94407 96636 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.


జంగారెడ్డిగూడెంలో టీడీపీ తరపున ఇంటింటా ప్రచారం చేస్తున్న మండవ లక్ష్మణరావు

శ్రీవారి సేవలో ఎన్నికల అబ్జర్వర్లు


శ్రీవారి చిత్రపటాలను అందుకుంటున్న ఎన్నికల అబ్జర్వర్లు

ద్వారకాతిరుమల, మే 9: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఎన్నికల అబ్జర్వర్ పార్థీప్‌కుమార్, ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్ రాహుల్ ధింగారా గురువారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి వేదాశీర్వచనం, ప్రసాదాలను అందజేయగా అధికారులు శ్రీవారి చిత్రపటాలను అందించారు.

సేవే పరమావధిగా సెయింట్ జోసెఫ్ కాలేజీ


ఏలూరు, ఖమ్మం పీఠాధిపతులు బిషప్ జయరావు, బిషప్ ప్రకాష్‌లతో కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్

పెదవేగి, మే 9 : గ్రామీణ ప్రాంతంలో పేదలకు సేవే పరమావధిగా వైద్యసేవలు అందించడమే ధ్యేయంగా సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల ఏర్పాటైందని ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర అన్నారు. దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల 22వ వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఖమ్మం పీఠాధిపతి బిషప్ ప్రకాష్‌సగిలితో కలిసి వార్షికోత్సవం పాల్గొన్న బిషప్ జయరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతోమంది పేదలకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.స్లీవరాజు కళాశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఓటు వినియోగంపై అవగాహన ఉండాలి


పోలింగ్‌బూత్ నమూనా

ఏలూరు టూటౌన్, మే 9 : ఓటర్లంతా ఓటుహక్కు ఎలా వినియోగించుకోవాలో అవగాహన కలిగి ఉండాలని ఏలూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి ముక్కంటి తెలిపారు. గవరవరం కట్టా సుబ్బారావుతోటలో పోలింగ్ బూత్ నమూనా ఏర్పాటు చేశారు. నమూనా బూత్‌లను, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. తాగునీరు, ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. పోలింగ్‌బూత్‌లో ఏజెంట్లు, అధికారులు సిబ్బంది అనేక ఏర్పాట్లు చేశారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఓటు ఎలా వినియోగించుకోవాలో తెలుసుకునేందుకు నమూన బూత్‌ను ఓటర్లంతా సందర్శించాలని ముక్కంటి తెలిపారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

పోలవరంలో చిరుజల్లులు

పోలవరం, మే 9 : పోలవరంలో గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈదురు గాలులు తగ్గిన అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడిన ప్రజానీకం వాతావరణం చల్లబడడంతో కొంత ఉపశమనం పొందారు.

రేపు రాత్రి 7 గంటల నుంచి 13 వరకు.. మద్యం షాపులు, బార్ల మూసివేత

ఏలూరు సిటీ, మే 9: సార్వత్రిక ఎన్నికలు ఈనెల 13వ తేదీన సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఉత్తర్వుల మేరకు ఈనెల 11వ తేదీ రాత్రి 7 గంటల నుంచి 13వ తేదీ రాత్రి 7 గంటల వరకు డ్రైడే అమలవుతుంది. ఈ కారణంగా జిల్లాలోని 152 మద్యం దుకాణాలు, 16 బార్లు, రెండు టూరిజం బార్లు, 251 కల్లు దుకాణాలు, రెండు డిస్టిలరీస్ ఏపీఎస్‌బీసీఎల్ మద్యం డిపోలకు ఈనెల 11వ తేదీ రాత్రి 7 గంటలకు సీళ్ళు వేసి ఈనెల 13వ తేదీ రాత్రి 7 గంటల వరకు మూసివేయనున్నట్టు జిల్లా మద్య నిషేధ ఆబ్కారి అధికారి డాక్టర్ ఆర్ఎస్ కుమరేశ్వరన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలసిన ట్రైనీ ఐపీఎస్ అధికారులు

ఏలూరు సిటీ, మే 9 : ఇండియన్ పోలీస్ శిక్షణ పొందుతున్న తొమ్మిది మంది ఐపీఎస్ అధికారులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న సందర్భంలో రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం ఉత్తర్వుల మేర కు జాతీయ పోలీస్ అకాడమిలో శిక్షణలో ఉన్న ట్రైనీ ఐపీఎస్ అధికారులు ఎన్నికల విధులు జిల్లాలో నిర్వహించేందుకు వచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో నేర్చుకునే అనేక అంశాలు భవిష్యత్ ఉద్యోగ నిర్వహణలో తోడ్పడతాయన్నారు. ఎన్నికలకు సంబంధించి వివిధ అంశాలను, ఎన్నికల నిర్వహణకు జిల్లాలో తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక సెలవు ఇవ్వండి

ఏలూరు ఎడ్యుకేషన్, మే 9 : సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులందరికీ ఈనెల 14న ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయాలని ఏపీ ఎన్జీవోల సంఘం, జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ నెల 12వ తేదీ ఉదయం సిబ్బంది ఎన్నికల సామాగ్రి తీసుకుని సాయంత్రానికి పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటారని, మరుసటి రోజు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ విధులు నిర్వహిస్తారన్నారు. అనంతరం వాటిని జిల్లా కేంద్రంలో ఉన్నతాధికారులకు అందజేసి ఇంటికి చేరుకునే సరికి అర్ధరాత్రి అవతుందన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకుని పోలింగ్ మరుసటి రోజున ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక సాధారణ సెలవుగా ప్రకటించాలన్నారు. గత ఎన్నికల్లో కూడా పోలింగ్ మరుసటి రోజున ప్రభుత్వం స్పెషల్ క్యాజువల్ లీవుని మంజూరు చేసిందని గుర్తు చేశారు.

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

పెదపాడు, మే 9 : యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు 30 రోజుల ఉచిత టైలరింగ్ శిక్షణను అందిస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. 18-45 ఏళ్ల వయస్సు గల మహిళలకు శిక్షణతో పాటుగా భోజన, వసతి ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపింది. శిక్షణ ఈనెల 27నుంచి ప్రారంభమవుతుందని, ఆసక్తిగల మహిళలు సత్రంపాడులోని వెలుగు కార్యాలయం పక్కన శిక్షణ కార్యాలయం వద్ద లేదా 95027 23561, 90140 40780, 99485 65256 ఈ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల స్పెషల్


చెన్నంశెట్టి పాండురంగారావు


నంబూరి వెంకట రామరాజు



ఎర్నేని రాజ రామచందర్

కలిదిండి నుంచి ముగ్గురు..

కైకలూరు నియోజకవర్గంలో మారుమూల మండలం కలిదిండి నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలుగా గెలుపొంది శాసనసభలో వాణి వినిపించారు. 1967లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా కోరుకొల్లుకు చెందిన చెన్నంశెట్టి పాండురంగారావు అసెంబ్లీకి పోటీ చేసి గెలుపొందారు. సీబీ కెనాల్ అభివృద్ధికి కృషి చేశారు. 1994లో జరిగిన ఎన్నికల్లో పోతుమర్రుకు చెందిన నంబూరి వెంకట రామరాజు (రాము) కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలిచారు. చేపల రైతుల సమస్యల పరిష్కారానికి, రోడ్ల అభివృద్ధికి కృషి చేశారు. 1993లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎర్నేని రాజ రామచందర్ (రాజబాబు) టీడీపీ అభ్యర్థిగా, 1999లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా, 2004లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొంది హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పేరొందారు. సాగు, తాగునీటి సమస్యలు, లంక గ్రామాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. రైతు బాంధవుడిగా, మాస్ లీడర్‌గా పేరొందారు.


-కలిదిండి

ఒకే ఒక్కడు..


కాజ రామనాథం

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చరిత్రలో ముదినేపల్లి మండలం నుంచి ఒకే ఒక నాయకుడు చట్టసభలో అడుగుపెట్టారు. మండలంలోని పెదగొన్నూరు గ్రామానికి చెందిన కాజ రామనాథం రెండు సార్లు ముదినేపల్లి నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారంలో తనకు తానే సాటి అనిపించుకున్నారు. 1962లో నియోజకవర్గం ఏర్పడిన సమయంలో రామనాథం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1967లో తిరిగి స్వతంత్ర అభ్యర్థిగా, 1972లో జాతీయ కాంగ్రెస్ అభ్యర్థిగా వరుసగా రెండు సార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. 1978లో జనతా పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. శాసనసభ్యుడిగా రామనాథం 1967 నుంచి 78 వరకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయటమే కాక డ్రైనేజీ, ఇరిగేషన్ వ్యవస్థల మెరుగుకు విశేష కృషి చేశారు. 1973లో ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలో సమైక్య ఆంధ్రకు కట్టుబడి అప్పటి ముఖ్యమంత్రి పీవీ నరసింహారావుకు అండగా నిలిచారు.

ముదినేపల్లే కీలకం..?



ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ముదినేపల్లి మండలం కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో కీలకం కానుందా అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. టీడీపీకి కంచుకోట లాంటి ఈ మండలంలో 2019 ఎన్నికల్లో వైసీపీకి సుమారు 1400 ఓట్ల ఆధిక్యత లభించింది. అంతకు ముందు సాధారణ ఎన్నికల్లో 1983 వరకు కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఇచ్చిన ఈ మండల ఓటర్లు 1985 నుంచి టీడీపీకి మెజార్టీ ఇచ్చారు. 2009 వరకు మండలంలోని పది గ్రామాలు మాత్రమే కైకలూరు నియోజకవర్గంలో ఉండేవి. ఆ పది గ్రామాల్లో వచ్చిన మెజార్టీ ఓట్లే నియోజకవర్గ ఫలితాన్ని ప్రభావితం చేసిన సందర్భాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనలో ఈ మండలం పూర్తిగా కైకలూరు నియోజకవర్గంలో కలవటంతో మండలంలో తెలుగుదేశం పార్టీ బలం పెరిగింది. మండలంలోని సుమారు 49 వేల ఓటర్లు ఉండగా, అత్యధిక శాతం బీసీ వర్గాల ఓటర్లే. ప్రస్తుతం నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల్లో సామాజిక వర్గాల ప్రాబల్యం ఎక్కువగా కనిపిస్తున్నది. ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడా సామాజిక వర్గాల వారీగానే ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే బీసీ వర్గాల ఓటర్లు ఎటు మొగ్గు చూపితే ఆ పార్టీకి ఈ మండలంలో మెజార్టీ వచ్చే అవకాశాలున్నాయని రాజకీయ వర్గాల అంచనా.

-ముదినేపల్లి


టీడీపీలో చేరుతున్న పెనుమాకలంక సర్పంచ్ నాగరాజు

వైసీపీకి గట్టి దెబ్బ

మండవల్లి, మే 9: మండవల్లి మండలం పెనుమాకలంక వైసీపీ సర్పంచ్ ముంగర నాగరాజు ఆ పార్టీని వీడి కైకలూరు నియోజకవర్గం అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో గురువారం చేరారు. వైసీపీలో పెరిగిపోయిన నిరంకుశత్వానికి విసిగి ఆ పార్టీని వీడినట్లు నాగరాజు పేర్కొన్నారు. పెనుమాకలంకలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన కామినేని సమక్షంలో తన అనుచరగణంతో భారీ సంఖ్యలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు కామినేని వెల్లడించారు.

కూటమిలో భారీగా చేరికలు

కైకలూరు, మే 9: ఎన్నికలకు నాలుగు రోజులే గడువున్నా గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున కూటమిలో చేరుతున్నారు. గురువారం కైకలూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ స్వగృహంలో పలు గ్రామాలకు చెందిన సుమారు 50 మంది కూటమి తీర్థం తీసుకున్నారు. వీరందరికీ కామినేని కండువాలు కప్పి ఆహ్వానించారు. చావలిపాడు మాజీ ఎంపీటీసీ గంగుల ఆదినారాయణ టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ వైసీపీ అరాచకాలను భరించలేకే ఆ పార్టీ నుంచి కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగానే కూటమి తీర్థం తీసుకుంటున్నారని వారి సంక్షేమానికి, ఆశయాలకు అనుగుణంగా గ్రామాలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ నాయకులతో కలిసి ఆయా గ్రామాల్లో భారీ మెజార్టీని తీసుకువచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.


కృష్ణారావుపాలెం చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ

చెక్‌పోస్టు తనిఖీ చేసిన ఇన్‌చార్జి డీఎస్పీ

చాట్రాయి, మే 9: తెలంగాణ సరిహద్దున గల మండలంలోని కృష్ణారావుపాలెం చెక్‌పోస్టును గురువారం నూజివీడు ఇన్‌చార్జి డీఎస్పీ జనార్దననాయుడు తనిఖీ చేశారు. పోలింగ్ తేదీ సమీపిస్తున్నందున నగదు, మద్యం, సారా మొదలైనవి అక్రమ రవాణా జరగకుండా, నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల తనిఖీని డీఎస్పీ పర్యవేక్షించారు. ఆయన వెంట నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ ఉన్నారు.

చింత తీరలేదు..!


చాట్రాయి మండలంలో అసంపూర్తిగా చింతలపూడి-2 కాల్వ

- వైసీపీ హయాంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం సర్వ నాశనం
- ఐదేళ్లుగా పట్టించుకోని ప్రభుత్వం.. పెరిగిన నిర్మాణ వ్యయం
- నిర్వాసిత రైతులకు అందని పరిహారం
- నూజివీడులో సీఎం జగన్ ఇచ్చిన హామీ నీటిమూటే..

చాట్రాయి, మే 9 : వైసీపీ సర్కార్ అధికారంలోకి వచ్చాక చింతలపూడి ఎత్తిపోతల పథకం సర్వనాశనం అయ్యిందని మళ్లీ చంద్రబాబు సీఎం అయితేనే పథకానికి మోక్షం కలిగి మెట్ట ప్రాంతం గోదావరి జలాలతో సస్యశ్యామలం అవుతుందని ఆయకట్టు రైతులు అంటున్నారు. మూడున్నరేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నాబార్డు నుంచి రూ.1,931 కోట్లు రుణం తీసుకుని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు. అయితే రైతులకు పరిహారం చెల్లించక పోవడంతో పనులు ముందుకు సాగలేదు. గత నవంబరులో నూజివీడులో జరిగిన అసైన్డ్ భూముల పట్టాల పంపిణీ సభలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు విజ్ఞప్తి మేరకు చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతిపదికన ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. కానీ పనులేవీ ప్రారంభం కాలేదు. ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలలో 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరు అందించే పథకం పట్ల జగన్ సర్కార్‌కి ఇంత నిర్లక్ష్యం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

టీడీపీ హయాంలో 70 శాతం పనులు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 70 శాతం పనులు జరగ్గా, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు నిలిపివేసి ఐదేళ్లు నిర్లక్ష్యం వహించడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు నష్టపరిహారం ఇస్తే పనులు చేయవచ్చని కాంట్రాక్టర్ ఏడాది పాటు ఎదురు చూసినా ప్రభుత్వంలో కదలిక లేకపోవడంతో పనులు నిలిపివేశారు. నిర్వాసిత రైతులకు ఇవ్వాల్సిన ఫేజ్-1లో రూ.100 కోట్లు, ఫేజ్-2 రూ.25 కోట్లు మొత్తం రూ.125 కోట్లు నష్టపరిహారాన్ని వైసీపీ ప్రభుత్వం ఇచ్చి పనుల కొనసాగించి ఉంటే ఈ పాటికి పథకం ఉపయోగంలోకి వచ్చేదని నిపుణులు చెబుతున్నారు.

ఫేజ్-2 పనులు పరుగులు

చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-2ను టీడీపీ హయాంలో ప్రారంభించి రూ.4,909 కోట్లు (1, 2 ఫేజ్‌లకు కలిపి) కేటాయించారు. ఈ పథకానికి 2017 సెప్టెంబరు 17న అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా మద్దులపర్వలో శంకుస్థాపన చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1ని 2008లో రాజశేఖరరెడ్డి సీఎంగా ఉండగా రూ.1,701 కోట్ల అంచనాలతో శ్రీకారం చుట్టారు. ఫేజ్-1 పథకం కాల్వ చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి వద్ద ముగుస్తుంది. రాష్ట్ర విభజన జరిగి ఎన్నెస్పీ ఎడమ కాల్వ ద్వారా ఆంధ్రా ప్రాంతానికి సాగునీరు వచ్చే అవకాశాలు తగ్గిపోవడంతో టీడీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-2కు రూపకల్పన చేసి పనులు పరుగులెత్తించింది. ఫేజ్-2 నిర్మాణం కోసం చాట్రాయి మండలం చీపురుగూడెం, కోటపాడు, చిన్నంపేట, పోతనపల్లి, బూరుగ్గూడెం, నరసింహారావుపాలెం గ్రామాల్లో 600 ఎకరాలు భూమి సేకరించి రూ.50 కోట్లు నష్టపరిహారం చెల్లించారు. చీపురుగూడెం నుంచి చాట్రాయి వరకు 14.5 కిలోమీటర్లు కాల్వ తవ్వాల్సి ఉండగా 3 కి.మీ మేర తవ్వారు. చాట్రాయి వద్ద నుంచి విస్సన్నపేట మండలం రామచంద్రాపురం ఎన్నెస్పీ 117 హెడ్ రెగ్యులేటర్ వరకు 10 కిమీ దూరం వేంపాడు మేజర్ కాల్వను 600 క్యూసెక్కుల సామర్థ్యం నుంచి 3,000 క్యూసెక్కులకు విస్తరణ పనులు 80 శాతం, చీపురుగూడెం వద్ద తమ్మిలేరుపై నిర్మించిన ఆక్విడెక్టు 90 శాతం పూర్తి చేశారు.

వైసీపీ రావడంతో దుర్దశ

2019 ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోవడంతో ఈ పథకానికి దుర్దశ వచ్చింది. పనులు పునః ప్రారంభిస్తారని ఆయకట్టు రైతులు, పరిహారం కోసం నిర్వాసిత రైతులు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. పథకం కోసం సేకరించిన భూములకు బ్యాంకులు, సహకార సంఘాల్లో రుణాలు ఇవ్వడం లేదు. వైద్య అవసరాలకు, పిల్లల పెళ్లిళ్లకు భూములు అమ్ముకుందామన్నా అవకాశం లేదు. ఈ పథకం పూర్తయితే ఏలూరు జిల్లాలో పోలవరం, గోపాలపురం, చింతలపూడి, దెందులూరు, నూజివీడు, ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం, తిరువూరు, గన్నవరం, నందిగామ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 4.80 లక్షల ఎకరాల మెట్ట భూములకు గోదావరి జలాలు అందడంతో పాటు, కొన్ని వందల గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుంది. జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం బాధ్యతారాహిత్యం చింతలపూడి ఎత్తిపోతల పథకానికి శాపంగా మారిందని చెప్పవచ్చు.


చాట్రాయి మండలం చీపురుగూడెం వద్ద తమ్మిలేరుపై నిర్మించిన అక్విడెక్టు

రైతాంగానికి తీరని అన్యాయం



చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు నిలిపివేసి వైసీపీ ప్రభుత్వం రైతాంగానికి తీరని అన్యాయం చేసింది. 70 శాతం పనులు పూర్తయిన పథకాన్ని ఐదేళ్లు పట్టించుకోకుండా శిథిలావస్థకు చేర్చిన తీరు చూస్తే, ఈ ప్రభుత్వానికి రైతుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదని అవగతమవుతోంది. నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వకపోవడం వల్ల వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. పథకం కోసం సేకరించిన భూములకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదు. అవసరాలకు అమ్ముకుందామన్నా అవకాశం లేకుండా పోయింది.

- మంచిన పూర్ణ చంద్రరావు, ఆయకట్టు రైతు, కోటపాడు, చాట్రాయి మండలం

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

- ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్
- ఉత్సాహంగా ర్యాలీ, రోడ్ షో

ముదినేపల్లి, మే 9:ఏలూరు లోక్‌సభ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, అందుకు రానున్న ఎన్నికల్లో తాను ఘన విజయం సాధించేందుకు ఓటర్లు ఆశీర్వదించాలని ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ కోరారు. ముదినేపల్లి మండలంలో గురువారం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి భారీ ర్యాలీతో రోడ్ షో నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతోపాటు కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఏలూరు లోక్‌సభ నియోజక వర్గ పరిధిలో పారిశ్రామికాభివృద్ధికి ఎన్నో వనరు లు ఉన్నాయి. సహజ సిద్ధమైన కొల్లేరు సరస్సు తీరం ఉంది. లక్షలాది మంది యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు, వీటన్నింటికీ శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చా రు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కొల్లేరు ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా, వ్యవసాయం, దాని అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తాన న్నారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్, రాష్ట్ర కార్యదర్శి కొత్తా నాగేంద్ర కుమార్, నాయకులు బీఎంకే నాని, ఈడ్పుగంటి శ్రీనివాస్, కొత్తూరు విఠల్, చలసాని జగన్మోహనరావు, పూల రాజీ, దావు నాగరాజు, బొంగు రవికుమార్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పైడిపాటి శివశంకర్, యర్రా నాని, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, మోటే పల్లి హనుమ, మదన్ మోహన్, బాసినొట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ర్యాలీ, రోడ్ షో..

ఏలూరు కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ఎన్నికల ప్రచార ర్యాలీ, రోడ్ షో కోలాహలంగా సాగింది. ముదినేపల్లి మండలం దాకరం వద్ద ప్రారంభమైన భారీ ర్యాలీ పేరూరు, పెయ్యేరు, ముదినేపల్లి, వడాలి, చిగురుకోట, బొమ్మినంపాడు, పెదగొన్నూరు, దేవపూడి గ్రామాల మీదుగా వైవాక చేరింది. నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కొడాలి వినోద్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

వైసీపీ మాటలకు మోసపోకండి : పుట్టా

మండవల్లి, మే 9: అధికార వైసీపీ అధికారాన్ని కాపాడుకునేందుకు వైసీపీ నేతలు చేస్తున్న మాయమాటలను నమ్మి మోసపోవద్దని ఏలూరు కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండవల్లి మండలం మణుగులూరు, కొవ్వాడలంక, పుల్లపర్రు సెంటర్, కాకతీయ నగర్, లోకుముడి, భైరవపట్నం, మండవల్లి, పెరికేగూడెం, కానుకొల్లు గ్రామాల మీదుగా మహేష్ రోడ్‌షో గురువారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రధాన కూడలిలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులను దోచుకునేందుకు, అధికా రాన్ని కాపాడుకునేందుకు వైసీపీ నేతలు దొడ్డిదారిన ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని, వాటిని నమ్మి మోసపోవద్దని కోరారు. రానున్నది కూటమి ప్రభుత్వమేనని ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రజలకు అందు బాటులో ఉంటామని ప్రజలు గ్రహించి ఓటు వేయాలని కోరారు. కూటమి నాయకులు బీకేఎం నాని, నారగాని నాగేశ్వరరావు, ముళ్ళపూడి సత్తిబాబు పాల్గొన్నారు. మణుగులూరు గ్రామంలో కైకలూరు బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని మహేష్ కుమార్‌యాదవ్ చేశారు.


మణుగులూరులో కామినేనితో కలిసి పుట్టా మహేష్‌యాదవ్ ప్రచారం


కొల్లేరు గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతున్న కామినేని శ్రీనివాస్


కలిదిండిలో కామినేని తనయుడు వేణుగోపాలకృష్ణ ప్రచారం

కాంటూరు కుదించి పట్టాలిప్పిస్తా : కామినేని

మండవల్లి, మే 9: కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపించి కాంటూరు 5 నుంచి 3కి తగ్గించి అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ పట్టాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని కైకలూరు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మండవల్లి మండలం మణుగులూరు, పెనుమాకలంక గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామాల్లో మంచినీరు, రహదారులు వంటి మౌలిక వసతులు తక్షణమే మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లుగా ఎమ్మెల్యే కొల్లేరుని పట్టించుకోలేదని విమర్శించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చెరువులు తవ్వాలంటే ఎవరికీ రూపాయి ముడుపులు ఇచ్చే వారు కాదని ఇప్పుడు చెరువులు తవ్వాలంటే ఇక్కడ ఎమ్మెల్యేకి, ఆయన కుమారులకు ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని కామినేని ఆరోపించారు. ఎమ్మెల్యే విధానాలు నచ్చక ముగ్గురు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆ పార్టీని వీడి కూటమిలో చేరారన్నారు. చెరువులను తక్కువ లీజుకు తీసుకోవడం, ఇవ్వక పోతే రైతులను బెదిరించడం, పోలీస్ స్టేషన్లో పెట్టి కొట్టించడం వంటివి ఎమ్మెల్యే చేశాడని కామినేని పేర్కొన్నారు. కైకలూరుకి దూలం నాగేశ్వరరావుతో పాటు ఆయన కుమారులు కూడా ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందిపాలు చేశార న్నారు. కొల్లేరు సంక్షేమ సంఘం నాయకుడు బలే ఏసురాజు, కూనపురెడ్డి రంగరాజు, బీకేఎం నాని, కైకలూరు నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు బోయిన రామకృష్ణ, కొల్లేటి లంక పెద్దలు పాల్గొన్నారు.

కొల్లేరు గ్రామాల్లో జీవనోపాధిని పెంచుతా

కైకలూరు: కొల్లేరు గ్రామాల్లో వివాదాలకు తావులేకుండా ప్రజల జీవనోపాధిని పెంపొందించేందుకు తనవంతు కృషి చేస్తానని కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు మండలం నత్తగుల్లపాడు, చటాకాయ్, వదర్లపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగు తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. తనకు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ కొల్లేరు ప్రజల సంక్షేమం కాంటూరు కుదింపుతోనే సాధ్యమవుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కాంటూరు 5 నుంచి 3కు కుదించి ప్రతి పేదవాడికి భూమి అందించేలా చర్యలు తీసుకుంటానన్నారు. వైసీపీ పాలనలో కొల్లేరు గ్రామాల్లో వర్గ విబేధాలు సృష్టించి లబ్ధిపొందాలని చూస్తున్నారని వైసీపీ మాటలకు ప్రజలు మోసపోవద్దని సూచించారు. గ్రామాల్లో తనకు అత్యధిక మెజార్టీ చూపిస్తే మీ కట్టుబాట్ల మధ్య అందరూ సమష్టిగా ఉండేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే నత్తగుల్లపాడు గ్రామంలో పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. జలగం వెంగళరావు ఇచ్చిన సొసైటీలను పునరుద్ధరించి ప్రజలు, మత్స్య సంపద పెంచుతానన్నారు. ఈ సందర్భంగా నత్త గుల్లపాడు ఉప సర్పంచ్ నబిగారి కొండలు, ముంగర థామస్, నబిగారి ఏసు రాజు, ముంగర సోమరాజు, నబిగారి భీమరాజు కూటమి తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, సీఎల్ వెంకటరావు, కొల్లి వరప్రసాద్, పీజేఎస్ మాల్యాద్రి, తోట లక్ష్మీ, శొంఠి రాజేశ్వరి, గంగుల శ్రీదేవి, నబిగారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కమ్మిలి సతీమణి ప్రచారం

కైకలూరులో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు సతీమణి స్వర్ణకుమారి 2, 3 వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కు సైకిల్ గుర్తుపై, అసెంబ్లీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీని తీసుకురావాలని కోరారు. అలాగే వెలంపేటలో ఇంటింటా ప్రచారం చేశారు. తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, వార్డు సభ్యులు గిరి కన్యాకుమారి, పిచ్చుకల సుధారాణి, పిచ్చు కల రమ్య, ముచ్చెర్ల అరుణ, మైనార్టీ నాయకులు ఎండీ జానీ, ఎండీ ఉస్మాన్, గఫూర్, బాషీద్, జిల్లా వాణిజ్య విభాగం నాయకులు కేకే బాబు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండిలో కామినేని తనయుడి ప్రచారం

కలిదిండి: కలిదిండిలో గురువారం కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ తనయుడు కామినేని వేణుగోపాలకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటి ప్రచారంలో ఆయనకు ప్రజలు పూలమాల వేసి స్వాగతం పలికారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, మాజీ ఎంపీపీ బండి లక్ష్మి, సొసైటీ మాజీ అధ్యక్షులు యార్లగడ్డ రవికుమార్, చిట్టూరి రమేష్, బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి గూడవల్లి శ్రీనివాసరావు, డీసీ మాజీ చైర్మన్లు సారిక వెంకటేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.


రమణక్కపేటలో మోటారును బయటకు తీస్తున్న దృశ్యం

తాగునీటి సమస్య పరిష్కారం

ముసునూరు, మే 9: 45 రోజులుగా తాగునీటి వెతలు శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రమణక్క పేట పంచాయతీలోని ఓసి ఏరియాలో తాగునీటి సమస్యపై గురువారం ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి, ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ సత్యప్రసాద్, ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కాలనీకి నీటి సరఫరా చేసే బోరు మోటర్ మరమ్మతుకు గురైనట్టు గుర్తించారు. యుద్ధప్రాతిపదికన పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో బోరులో నుంచి మోటార్‌ను బయటకుతీసి, మరమ్మతు చేయించారు. సాయంత్రం మోటార్‌ను బిగించి మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. రమణక్కపేట గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య రాకుండా ఆర్‌డబ్ల్యూయస్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

కొనసాగిన పోస్టల్ బ్యాలెట్



నూజివీడు, మే 9: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం ఇవ్వడంతో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు గురువారం సైతం పోస్టల్ బ్యాలెట్ నమోదు ప్రక్రియను కొనసాగించారు. నూజివీడు ఆర్వో కార్యాలయంలో పోలింగ్ నిర్వహించగా, నూజివీడు నియోజకవర్గ పరిధిలో 45 మంది, ఇతర నియోజకవర్గాలకు చెందిన 12 మంది తమ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా పోస్టల్ బ్యాలెట్ నమోదు ప్రక్రియకు 7, 8 తేదీల్లో మాత్రమే చివరి అవకాశం అని అధికారులు పేర్కొన్నా, పోలింగ్ విధుల్లో పాల్గొనే అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు మరో అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా గురువారం అనుమతులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

సెబ్ దాడులు.. ముగ్గురి అరెస్టు

నూజివీడు టౌన్, మే 9: నూజివీడు సెబ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 136 బాటిళ్ల అనధికార మద్యం, పది లీటర్ల సారాను స్వాధీన పరుచుకున్నట్లు నూజివీడు ఎస్ఈబీ సీఐ వెంకటరమణ తెలిపారు. నూజివీడు పట్టణ పరిధిలో అనధికారిక మద్యం కలిగి ఉన్నారన్న సమాచారం మేరకు రాజుల రాజ్యలక్ష్మి అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 72 మద్యం సీసాలను, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, మరో ఘటనలో రెడ్డి ఏడుకొండలను అదుపులోకి తీసుకుని 64 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామంలో గుజ్జర్లపూడి రవికుమార్‌ను అదుపులోకి తీసుకుని అతని నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

వాహనాల విస్తృత తనిఖీలు

ముదినేపల్లి, మే 9 : పామర్రు - దిగమర్రు జాతీయ రహదారిలో కృష్ణా - ఏలూరు జిల్లాల సరిహద్దుల్లో, ముదినేపల్లి మండలం పెదపాలపర్రు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్ పోస్టు వద్ద గురువారం సుమారు 200 వాహనాలను, ఆర్టీసీ బస్సులను ఎంపీడీవో మురళీ గంగాధరరావు, చెక్ పోస్టు అధికారి కె.రమణబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీలను నిర్వహించారు. వాహనాల్లో రవాణా చేస్తున్న కూరగాయల బస్తాలను కూడా తనిఖీ చేశారు. ఎన్నికల్లో ధన ప్రవాహం ప్రారంభమైనందున వాహనాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, డ్రైనేజీ ఏఈలు కుమార్, భోగేంద్ర ప్రసాద్ ఇతర సిబ్బంది అనధికార మద్యం అమ్మకాలపై నిఘా విధించి సుమారు 50 వాహనాలను తనిఖీ చేశారు.

వేల్పుచర్లలో...



ముసునూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు చేస్తున్నాయి. గురువారం ఫ్లయిం గ్ స్క్వాడ్ హెడ్ పి.శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో ముసునూరు, వేల్పుచర్ల, రమణక్కపేట, చెక్కపల్లి గ్రామాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. అక్రమంగా మద్యం, నగదు, ఇతర తాయిలాలు రవాణా చేస్తూ పట్టుబడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.